విశాలాంధ్ర



ఏలూరు, పశ్చిమ గోదావరి
కాకినాడ, కోనసీమ
తూర్పుగోదావరి

బుధవారం 21 మే 2025 8 పేజీలు

లోకేష్‌కు మార్గం సుగమం!

- మహానాడులో కీలక నిర్ణయం తీసుకునే అవకాశం
- ఢిల్లీ పర్యటనలో అంతుపట్టని ఆంతర్యం
- పార్టీలో తనదైన ముద్ర

టీడీపీ రాజకీయాలు శరవేగంగా మారుతున్నట్లు తెలుస్తోంది. ఈనెల చివరిలో జరగబోయే తెదేపా మహానాడు వేడుకలలో రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి,లోకేష్ కు పార్టీలో ప్రధాన బాధ్యత అప్పగించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు లైన్ క్లియర్ చేస్తున్నట్లు సమాచారం. ఈ మేరకు చంద్రబాబు వ్యూహరచన చేస్తున్నట్లు అవగతమవుతోంది.

మంత్రి లోకేష్ ఇటీవల కుటుంబ సమేతంగా ఢిల్లీ పర్యటనలు చేసి ప్రధాని మోడీతో పాటు పలువురు కేంద్ర మంత్రులను కలవడం వెనుక భారీ వ్యూహం ఉందని పార్టీ నేతలు భావిస్తున్నారు. టిడిపిలో ఏం జరగాలన్నా లోకేష్ అనుమతి తప్పనిసరి అని ప్రచారం సాగుతోంది.

విశాలాంధ్ర బ్యూరో-ఏలూరు: మరో 8 రోజుల్లో జరిగే టీడీపీ మహానాడులో సీఎం చంద్రబాబు నాయుడు తనయుడు లోకేష్ కీలక బాధ్యతలు తీసుకుంటారని టాక్ వినిపిస్తోంది. ఈ నేపథ్యంలోనే ఆయన ప్రధాని మోదీతోపాటు కేంద్రంలోని కీలక నేతలతో భేటీ అయ్యారని అంటున్నారు. టీడీపీ యువనేత లోకేశ్ పట్టాభిషేకానికి ముఖ్యమంత్రి చంద్రబాబు లైన్ క్లియర్ చేస్తున్నారా? ప్రధాని నరేంద్ర మోదీని కుటుంబ సమేతంగా లోకేశ్ కలవడానికి ప్రధాన కారణం ఉందా? ప్రధాని మోదీయే రమ్మనమని లోకేశ్ ను ఆహ్వానించారని ప్రచారం చేస్తున్నా ప్రధానితో భేటీ వెనుక పెద్ద కారణమే ఉందంటూ జరుగుతున్న ప్రచారం ఆసక్తి రేపుతోంది.

పాలనలో లోకేష్ ముద్ర

ప్రస్తుతం టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శిగా వ్యవహరిస్తున్న లోకేష్ మరో 8 రోజులలో జరిగే మహానాడులో ▶మిగతా 2లో..

నూతన విద్యుత్ సబ్ స్టేషన్లు

- జిల్లా వ్యాప్తంగా 90 టవర్లు ఏర్పాటు
- ఇప్పటికే 60 నిర్మాణం
- 15 రోజుల్లో మరో ముప్పై ఏర్పాటు
- కలెక్టర్ మహేష్ కుమార్

విశాలాంధ్ర - అమలాపురం : నూతనంగా ఏర్పడిన డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా వాసుల విద్యుత్ డిమాండ్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని నూతన సబ్ స్టేషన్ ఏర్పాటు ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్తు టవర్లు లైన్లు ఆధునీకరణ వంటి ▶మిగతా 2లో..

కార్మిక వ్యతిరేక విధానాలను విడనాడండి : కార్మిక సంఘాలు

ఏలూరులో ఏఐటియుసి, సిఐటియు, ఐఎఫ్టియు నిరసన

విశాలాంధ్ర-ఏలూరు: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలు విడనాడాలని, కార్మిక వర్గానికి తీరని ద్రోహం తలపెట్టే 4 లేబర్ కోడ్ లను రద్దు చేయాలని ఏఐటీయూసీ, సిఐటియు, ఐఎఫ్టియు కార్మిక సంఘాలు డిమాండ్ చేశాయి. కార్మిక వ్యతిరేక 4 లేబర్ కోడ్ లను రద్దు చేయాలని కోరుతూ కేంద్ర కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపులో భాగంగా మంగళవారం ఏలూరులో స్థానిక పాత బస్టాండ్ వద్ద గల అంబేద్కర్ విగ్రహం వద్ద ఏఐటియుసి, సిఐటియు, ఐఎఫ్టియు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం ▶మిగతా 2లో..

ఆదివాసీలకు న్యాయం చేయండి

సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య

విశాలాంధ్ర - వేలేరుపాడు : పోడు వ్యవసాయం నమ్ముకుని జీవిస్తున్న ఆదివాసీలకు ఆయా భూములకు పట్టాలు ఇచ్చి ఆదుకోవాలని సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మండలంలోని ఇప్పలగుంపు, ఉదయ నగర్, పూచిరాల,పాత పూచిరాల సీపీఐ శాఖల సమావేశాలు ఆయా గ్రామాల్లో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తరతరాలుగా పోడు వ్యవసాయంపై గిరిజనులు ఆధారపడి ఉన్నారన్నారు. వాటికి పట్టాలు లేకపోవడం వలన ప్రభుత్వం అందించే సబ్సిడీ విత్తనాలు, ఎరువులు ఇతర వ్యవసాయం సంబంధించినవి వారికి అందటం లేదన్నారు. పదేపదే కార్యాలయాల చుట్టూ తిరిగి దరఖాస్తు చేసు కున్నా పట్టించుకోవటం లేదని వాపోయారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఆయా భూములకు పట్టాలు ఇచ్చేలా చర్యలు చేపట్టాలన్నారు. గోదావరి వరదలు సమయం ఆసన్నమైందని, ముంపు గ్రామాల్లో ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. పెద్దవాగు ప్రాజెక్టు మరమ్మతు పనులు వెంటనే చేపట్టాలన్నారు.

ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు సూపర్ సిక్స్ పథకాలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉందన్నారు.

జిల్లా మహాసభ జయప్రదం చేయండి

జూలై 5, 6, 7న చింతలపూడిలో నిర్వహించే సీపీఐ జిల్లా మహాసభలు జయప్రదం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మహాసభకు మండలం నుండి వందల సంఖ్యలో కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశాల్లో రాష్ట్ర సమితి సభ్యులు ఎండి మునీర్,జిల్లా కార్యవర్గ సభ్యులు సన్నేపల్లి సాయిబాబు, కారం దారయ్య, జిల్లా కౌన్సిల్ సభ్యులు ▶మిగతా 2లో..

ప్రభుత్వాసుపత్రుల్లోనే ప్రసవాలపై అవగాహన కల్పించాలి

కలెక్టర్ చదలవాడ నాగరాణి

విశాలాంధ్ర-నరసాపురం: గర్భిణీలు ప్రభుత్వ ఆసుపత్రులలోనే ప్రసవం చేసుకునే విధంగా వారికి అవగాహన కల్పించాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి నరసాపురం ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిని సందర్శిం చారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని ఓ.పి రిజిస్టర్లు, పలు విభాగాలను, వైద్య సేవలు అందించే అన్ని వార్డులు క్షుణ్ణంగా పరిశీలిం చారు. అక్కడ అందుతున్న సేవల గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు. మరుగుదొడ్లు, పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సౌకర్యాలు పరిశీలించారు. అనంతరం కలెక్టర్ డి సి హెచ్ ఎస్, ఆసుపత్రి కమిటీ సభ్యులు, వైద్యాధికారులతో మాట్లాడుతూ సిబ్బంది పనితీరు, ఆసుపత్రిలో రోగులకు అందుతున్న సేవలు, వారికి అందిస్తున్న మందులు, ఆసుపత్రికి ప్రతిరోజు వచ్చే రోగుల సంఖ్య, ఆసుపత్రిలో జరుగుతున్న ఆపరేషన్లు వంటి విషయాల పై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వైద్యాధికారులు, డాక్టర్లు, సిబ్బంది తప్పనిసరిగా సమయపాలన పాటించి రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవాలు పెంచేందుకు గర్భిణీలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో గర్భిణీలకు ఉచిత అల్ట్రాసౌండ్ స్కానింగ్ చేయడానికి ప్రముఖ వైద్యులు డాక్టర్ పద్మావతి ముందుకు రావడం పట్ల జిల్లా కలెక్టర్ ఆమెను అభినందించారు. కంటి వైద్యానికి సంబంధించి ఏ స్కాన్ అవసరమని కమిటీ సభ్యులు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా కలెక్టర్ స్పందించి ఏ స్కాన్ కొనుగోలుకు చర్యలు తీసుకోవాలన్నారు. రెవిన్యూ డివిజనల్ అధికారి, మున్సిపల్ కమిషనర్, ఆసుపత్రి కమిటీ సభ్యులు తరచుగా ఆసుపత్రిని సందర్శించి రోగులకు అందుతున్న సేవలపై ఎప్పటికప్పుడు ▶మిగతా 4లో..

ప్రజా పంపిణీ వ్యవస్థ ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర - కొవ్వూరు : మండల స్టాక్ పాయింట్లు వద్ద ఉన్న సరుకుల స్టాక్ వివరాలను , రిజిస్టరు ప్రకారం నిర్వహిస్తున్నారో? లేదో? ప్రజా పంపిణీ వ్యవస్థ పనితీరును క్షేత్రస్థాయి పర్యటన సందర్భంలో ఖచ్చితంగా తనిఖీ చెయ్యాలని కలెక్టర్ పి. ప్రశాంతి స్పష్టం చేశారు. మంగళవారం చాగల్లు మండలం ఉనగట్ల ఎమ్ ఎస్ ఎల్ పాయింట్, కొవ్వూరు పట్టణ ప్రాంతంలో ఉన్న చౌక ధరల దుకాణాన్ని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పౌర సేవలు అందించే క్రమంలో క్షేత్ర స్థాయిలో ఆయా వ్యవస్థల పనితీరు పై జిల్లా స్థాయి అధికారులు తనిఖీలు నిర్వహించాల్సి ఉందన్నారు. ఆమేరకు చాగల్లు మండలం ఉన్నకట్ల గ్రామంలోని మండల స్టాక్ పాయింట్ ▶మిగతా 4లో..

మరో మత్స్యకార సంఘం వద్దంటూ ఆందోళన

విశాలాంధ్ర-టి నరసాపురం: బొర్రంపాలెంలో తమకు తెలియకుండా మరో మత్స్యకార సంఘం ఏర్పాటు చేయ వద్దంటూ స్థానిక మత్స్యకార సంఘం సభ్యులు స్థానిక సచివాలయం వద్ద మంగళవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో గత 30 ఏళ్లుగా 30 మంది సభ్యులతో మత్స్యకార సంఘం కొనసాగు తుందని వారు తెలిపారు. కొందరు సంఘంలో చీలిక తీసుకురావాలని పంచాయతీలో ఉన్న 14 మంది వార్డు సభ్యులలో 9 మందికి తెలియకుండా తప్పుడు తీర్మానాలు పొంది మత్స్యకార సంఘాన్ని ఏర్పాటు చేయడానికి సన్నాహాలు చేస్తున్నారంటూ అసహనం వ్యక్తం చేశారు. మరో మత్స్యకార సంఘం ఏర్పాటు చేయడం విరమించాలని వారు డిమాండ్ చేశారు. మరో మత్స్యకార సంఘం ఏర్పాటుకు తీర్మానం ఎలా చేశారంటూ పంచాయతీ కార్యదర్శి పగడం నాగేశ్వరరావును సెల్ ఫోన్ ద్వారా వివరణ కోరగా ఆ తీర్మానాన్ని రద్దు చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పంచాయతీ విస్తరణ అధికారి శ్రీనివాసులుకు మత్స్య కార సంఘం నాయకులు సభ్యులు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్ర మంలో బత్తుల రమేష్, గుండె చిన్న చిట్టియ్య, రాంబాబు, వెంకటేష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వలవల బాబ్జిని కలిసిన నిడమర్రు టిడిపి నాయకులు

విశాలాంధ్ర - నిడమర్రు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర భవన నిర్మాణ కార్మికుల వెల్ఫేర్ బోర్డు చైర్మన్‌గా నియమితులైన తాడేపల్లిగూడెం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి వలవల బాబ్జిని నిడమర్రు మండల తెలుగుదేశం పార్టీ నాయకులు గణపవరం మండలం వరదరాజపురం గ్రామంలో జరిగిన మినీ మహానాడు కార్యక్రమంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నిడమర్రు మండలం క్రొవ్విడి గ్రామానికి చెందిన ఏలూరు జిల్లా తెలుగు యువత కార్యదర్శి మహమ్మద్ గఫర్ ఖాన్, తాడి శ్రీనివాసరావు, దిగమర్తి విజయ కుమార్, తాడి సాయి, దొండ సత్యనారాయణ, కాసగాని శేఖర్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

డిఎన్నార్ పి.జి.ఫలితాల విడుదల

విశాలాంధ్ర -భీమవరం: డిఎన్నార్ కళాశాల పి.జి కోర్సెస్ రెండు, నాల్గవ సెమిస్టర్ పరీక్ష ఫలితాలను కళాశాల పాలకవర్గ అధ్యక్షులు గోకరాజు వెంకట నరసింహరాజు, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ గాదిరాజు బాబు విడుదల చేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ కళాశాలలో ప్రస్తుత మార్కెట్ అవసరాలకు అనుగుణంగా నూతన కోర్సులను ప్రవేశపెట్టి నేటి టెక్నాలజీకి అనుగుణంగా విద్యార్థులను తర్ఫీదు ఇచ్చి వారికి తగిన అర్హత కలిగిన ఉద్యోగాలు కల్పించడానికి కృషి చేస్తున్నామన్నారు. ఈ విద్యా సంవత్సరం నుండి బి.యస్.సి నర్సింగ్, బి.సి.ఎ, బి.బి.ఎ కోర్సు లను కూడా ప్రారంభిస్తున్నామని తెలిపారు. ప్రిన్సిపాల్ జి.మోజెస్ మాట్లాడుతూ పి.జి పరీక్ష ఫలితాలలో నాల్గవ సెమిస్టర్ లో 500 మంది హాజరు కాగా 467 మంది ఉత్తీర్ణత 93 శాతం ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ఉపాధ్యక్షులు గోకరాజు పాండు రంగ రాజు, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

కార్మికసంఘాలు (1వ పేజీ తరువాయి)

నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస్ డాంగే,సిఐటియు జిల్లా కార్యదర్శి డి ఎన్ వి డి ప్రసాద్, ఐ.ఎఫ్.టి.యు నాయకులు రాంబాబు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను తక్షణమే విడనాడాలని డిమాండ్ చేశారు.జులై 9వ తేదీ జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో ఉద్యోగులు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ నిరసనను కేంద్ర ప్రభుత్వానికి తెలియజేయాలని నాయకులు కోరారు.ఎన్నో పోరాటాల ద్వారా సాధించుకున్న కార్మిక చట్టాలను కేంద్ర మోడీ ప్రభుత్వం లేబర్ కోడ్ పేరుతో కాలరాస్తుందని విమర్శించారు. సమ్మె చేసే హక్కును, సంఘం పెట్టుకునే హక్కును, అనేక చట్టాలను కార్మిక వర్గానికి దూరం చేస్తూ, కార్పొరేట్లకు, ప్రైవేట్ యాజమాన్యాలకు లబ్ది చేకూర్చే విధానాలను చేపట్టిందని విమర్శించారు. 78 సంవత్సరాల స్వాతంత్ర భారత్‌లో ఏర్పాటు చేసుకున్న ప్రభుత్వ రంగ సంస్థలను, పరిశ్రమలను కార్పొరేట్లకు ప్రైవేటు వ్యక్తులకు కారుచౌకగా మోడీ ప్రభుత్వం అప్పగిస్తుందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా కార్మిక వ్యతిరేక విధానాలు విడనాడాలని లేనిపక్షంలో జులై 9వ తేదీ జరిగే సమ్మెలో కోట్లాదిమంది కార్మికుల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు, జిల్లా కోశాధికారి పుప్పాల కన్నబాబు, నగర కార్యదర్శి ఏ అప్పలరాజు, బళ్ల కనకదుర్గారావు, బి కే యం యు నాయకులు బుగ్గల ప్రభాకర్, అరిగెల యోహాన్,ఎస్. బాపూజీ, కే భాస్కరరావు, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కే. శ్రీనివాస్,సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్ లింగరాజు,బి. సోమయ్య, ఇఫ్టియు నాయకులు మీసాల రమణ, మంగ అప్పారావు, దూల వీర నాయుడు, సంద కప్పారావు, నగరెడ్డి లక్ష్మణ తదితరులు పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్లు (1వ పేజీ తరువాయి)

పనుల నిర్వహణ నిమిత్తం జిల్లాలో రామచంద్ర పురం డివిజన్, కొత్తపేట డివిజన్లోని ఆత్రేయపురం రావులపాలెం, కొత్తపేట మండలాల్లో మినహా మిగిలిన మండలాలలో విద్యుత్ పవర్ కట్ ముందుగా నిర్దేశించిన గ్రామాలలో ఉంటుందని కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్ తెలిపారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో ఏపీ ట్రాన్స్కో, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీర్లతో సమా వేశం నిర్వహించి విద్యుత్ టవర్లు ఏర్పాటు సందర్భంలో విద్యుత్ పవర్ కట్ అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 90 టవర్లు వేయాల్సి ఉండగా ఇప్పటివరకు 60 టవర్లు నిర్మించినట్లు మిగిలిన 30 టవర్లు నిర్మాణానికి సంబంధించి రోజుకు రెండు చొప్పున నిర్మించనున్నట్లు తెలిపారు. వీటి నిర్మాణ సందర్భంలో విధించే విద్యుత్ అంతరాయ సమయాలను, గ్రామాల్లో ముందుగా తెలియజేస్తా రని, ఆ మేరకు వినియోగదారులు సహకరించాల న్నారు. విద్యుత్ అంతరాయాలను ఉదయం 11 గంటల నుండి సాయంత్రం 5 గంటల మధ్య సమయంలో విధిస్తారని తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో ఎటువంటి విద్యుత్ అంతరాయాలు (పవర్ కట్లు) విధించలేదని ఆయన స్పష్టం చేశారు. రొటేషన్ పద్ధతిలో ఎవరికి పెద్దగా ఇబ్బందులు లేకుండా ఒక సబ్ స్టేషన్లో ఉన్న నాలుగు ఫీడర్లు ఉంటే రోజు కొక ఫీడర్ చొప్పున ఒక గంట పాటు విద్యుత్ అంతరాయాన్ని విధించనున్నట్టు తెలిపారు. జిల్లా గ్రామీణ త్రాగునీటి సరఫరా విభాగానికి ఎటువంటి విద్యుత్తు అంతరాయాలను విధించరాదని 24/7 త్రాగునీటి అవసరాలకు విద్యుత్ సరఫరా ఉండాలని ఏపీ ట్రాన్స్కో ఇంజనీర్లను ఆదేశించారు. ఏపీ ట్రాన్స్కో విశాఖపట్నం జోనల్ చీఫ్ ఇంజనీర్ బి.శ్యాంప్రసాద్ మాట్లాడుతూ జిల్లా స్థాయి అవసరాల దృష్ట్యా సబ్ స్టేషన్లు ట్రాన్స్ఫార్మర్లు విద్యుత్తు లైన్ ఆధునీకరణ వంటి పనుల నిమిత్తం విద్యుత్ అంతరాయాలను 15 రోజుల పాటు విధించనున్నట్టు తెలిపారు. దీనికి విద్యుత్ వినియోగదారులు పూర్తిగా సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్కో ఎస్ఈ ఎస్ రాజబాబు, గ్రామీణ నీటి సరఫరా, పారిశుద్ధ్య శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ సిహెచ్ ఎన్వి కృష్ణారెడ్డి, ఇరు విభాగాల ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

సుగమం (1వ పేజీ తరువాయి)

కీలక బాధ్యతలు తీసుకుంటారని వ్యాఖ్యానాలు వినిపిస్తున్నాయి.ఈ నేపథ్యంలోనే ఆయన ప్రధాని మోడీతో పాటు కేంద్రంలోని కీలక నేతలతో భేటీ అయ్యారని అంటున్నారు.ప్రస్తుతం మంత్రిగా ప్రభుత్వంలో పూర్తి పట్టు సాధించినట్లేనని చెబుతున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు స్వీయ పర్యవేక్షణలో పాలనపై అవగాహన పెంచుకుంటున్న లోకేష్ పార్టీకి భావినేతగా అందరి ఆమోదం పొందినట్లేనని ప్రచారం సాగుతోంది.ప్రస్తుతం పార్టీలో ఏం జరగాలన్నా లోకేష్ అనుమతి ఉండాల్సిందేనని పలువురు నాయకులు చెబుతున్నారు. ప్రభుత్వ నిర్ణయాలలో లోకేష్ ముద్ర స్పష్టంగా కనిపిస్తోం దని అధికార వర్గాల్లో చర్చ జరుగుతోంది.

భావినేతగా ఎదగడానికి వ్యూహరచన

ఇటు రాజకీయంగా, అటు ప్రభుత్వ పరంగా లోకేష్‌కు సంపూర్ణ అవగాహన ఉండాలని భావి స్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు ఓ అడుగు వెనక్కి తగ్గి,లోకేష్‌తో ముందడుగు వేయించాలని భావిస్తున్నారని అంటున్నారు. లోకేష్‌ను ప్రధాన నేతగా తీర్చిదిద్దడంలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు పూర్తిగా సమీక్షలు, కొన్ని అధికార కార్యక్రమాలకు మాత్రమే పరిమితమవుతున్నట్లు ఇటీవల జరిగిన పరిణామాలను బట్టి తెలుస్తోంది. ఇక రాజకీయ నిర్ణయాలు ఇతర పార్టీలతో స్నేహ సంబంధాలు వంటివి పూర్తిగా లోకేష్ కే అప్పగించినట్టు చెబుతున్నారు.

సత్సంబంధాలే ప్రధాన టాస్క్

రాష్ట్రంలో బిజెపి,జనసేనతో సమన్వయం విషయంలో,కేంద్రంలో బిజెపి పెద్దలతో లోకేష్ మంత్రాంగం నడుపుతున్నట్లు ఇటీవల పరిణామాలు తెలియజేస్తున్నాయని అంటు న్నారు. సాధారణంగా ముఖ్యమంత్రి మాత్రమే ఢిల్లీ వెళ్లి కేంద్ర మంత్రులు, ప్రధానితో భేటీ అవుతుంటారు. ఏదైనా రాష్ట్ర మంత్రి ఢిల్లీ పర్యటనకు వెళితే తమ శాఖ పరిధిలోని అధికారిక కార్యక్రమాలకు మాత్రమే పరిమితం అవుతారు.కానీ రాష్ట్ర మంత్రి హోదాలో ఢిల్లీకి వస్తున్న లోకేష్ ఏపీ ప్రభుత్వం తరపున కేంద్రంలో అన్ని శాఖల మంత్రులతోనూ సమావేశం అవుతున్నారు. తన రాష్ట్రానికి నిధులు సేకరణతో పాటు ప్రాజెక్టులకు అనుమతి సాధించేలా అడుగులు వేస్తున్నారు.ఇది అధికారిక పనే అయినప్పటికీ అంతర్లీనంగా ఆయా నేతలతో బంధాలు గట్టి చేసుకోవడమే ప్రధాన టాస్క్‌గా ఉందంటు న్నారు. రాజకీయాలలో పది కాలాలపాటు కొనసాగాలంటే సరైన వ్యూహరచన, నైపుణ్యం అవసరమని ముఖ్యమంత్రి చంద్రబాబు భావిస్తున్నారట. అందుకే తన కుమారుడు అన్ని రకాలుగా రాటుదేలాలని కేంద్రంలో పేరు మోసిన నేతల నుంచి రాజకీయ ఎత్తుగడలు నేర్చుకోవాలని సలహాలు ఇస్తున్నారని అంటున్నారు.

ఖచ్చితమైన హద్దులతో రీ సర్వే ఉండాలి

విశాలాంధ్ర - ఉండి : ఎటువంటి వివాదాలకు తావు లేకుండా ఖచ్చితమైన హద్దులతో భూ రీ సర్వే పక్కగా ఉండాలని స్థానిక తహసీల్దార్ కావడి నాగర్జున అన్నారు. మండల పరిధిలోని మహాదేవపట్నం గ్రామంలో జరుగు తున్న రీ సర్వే టీంలతో మంగళవారం నాగార్జున క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. భూ రికార్డులను పరిశీలించి సర్వే బృందాలకు పలు సూచనలు, సలహాలు అందించారు. రైతులతో మమేకమై సర్వే బృందాలకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ ఎటువంటి వివాదాలకు తావు లేకుండా ఎన్ని అవరోధాలు వచ్చినా ఈ సర్వే బృందం ఖచ్చితమైన హద్దులతో ముందుకు సాగుతుందన్నారు. రైతులు రీ సర్వే బృందానికి సహకరించటం హర్షణీయమన్నారు. రైతులు తమకు అందించిన సమాచారం మేరకు తమ తమ పొలాల వద్ద ఉండటం అభినందనీయ మన్నారు. త్వరితగతిన రీ సర్వేను పూర్తి చేసి రైతుల సమస్యలను పరిష్కరించి వారికి ఖచ్చితమైన హద్దులు చూపించి వారి మన్ననలు పొందటం జరుగుతుందని తెలిపారు. ఎండ, వర్షం సైతం లెక్కచేయ కుండా ఈ సర్వే బృందం ముందుకు సాగటం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక గ్రామ రెవెన్యూ అధికారులు సిహెచ్. చిన్నారావు, శ్రీనివాసరావు, గ్రామ రెవెన్యూ సహాయకులు భాష, నాగమణి, సర్వేర్లు, రైతులు సుబ్బరాజు, తదితరులు పాల్గొన్నారు.

మురుగు డ్రైన్ పనులు చేపట్టాలి

విశాలాంధ్ర- ఉండి : మేజర్, మైనర్ మురుగు కాలువల తవ్వకం పనులు చేపట్టాలని ఎండగండి వినియోగదారుల సంఘం కార్యదర్శి పివిఎస్ గోపాలకృష్ణంరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళ వారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. గత ఐదు సంవత్సరాలలో ఎండగండి పరిధిలో మురుగు కాలువలు తవ్వకం లేక ఖరీఫ్ సీజన్లో అధిక వర్షాలకు వరి పంట ముంపునకు గురి అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. మేజర్, మైనర్ మురుగు కాల్వలోని పూడికతీత పనులు చేయకపోవడం వల్ల రైతులు నానా అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు. గత పది సంవత్సరాల నుండి పూడిక తీత పనులు లేవని మురుగు కాలువలు ఎక్కడకక్కడే మేటలు వేసి ఉన్నాయని తెలిపారు. జిల్లా కలెక్టర్ వేసవిలో కాలవ తవ్వకాలకు కనీసం కమిటీ వేయకపోవడం దారుణం అన్నారు. ఎండగండిలో మురుగు అండర్ టెనల్ రంధ్రం పడి తాగు, సాగునీరు కలుషితం అవుతున్నా ఎవరూ పట్టించుకోలేదని పేర్కొన్నారు. షట్టర్లు, స్లూయిజులు, శిథిలావస్థలో ఉన్నాయని తెలిపారు. వాటిని వేసవిలో మరమ్మతులు చేయాలని విజ్ఞప్తి చేశారు.

సూక్ష్మ రుణ ప్రణాళిక తయారు చేసుకోవాలి

విశాలాంధ్ర-దెందులూరు: సూక్ష్మ రుణ ప్రణాళిక తయారు చేసుకొని దాని అమలుకు సెర్ప్ సిబ్బంది పని చేయాలని సెర్ప్ సీఈఓ కరుణ వాకాటి పేర్కొన్నారు. జిల్లా పర్యటనలో భాగంగా మంగళవారం దెందులూరు మండలం, కొవ్వలి గ్రామంలో సెర్ప్ సీఈవో కరుణ వాకటి పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో జరుగుతున్న యాన్యువల్ క్రెడిట్ లైవ్ లీ హుడ్ ప్లాన్ సర్వేలో పాల్గొని ఏ విధంగా జరుగుతున్నదని డ్వాక్రా సంఘ సభ్యుల ద్వారా తెలుసుకున్నారు.ఏ ఏ జీవనోపాధులు చేస్తున్నారు,ఏ విధంగా ఆదాయం వస్తుంది,రాబోయే రోజుల్లో ఏ విధమైన అప్పులు వారికి అవసరమైయున్నది తెలుసుకుని వారికి రాబోయే సంవత్సర కాలం లో సూక్ష్మ ఋణ ప్రణాళిక తయారు చేసుకుని దాని అమలుకు సెర్ప్ సిబ్బంది పనిచేయవలసినదిగా ఆదేశించారు. కార్యక్రమంలో డి.ఆర్.డి.ఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ డా.ఆర్.విజయరాజు,ప్రాజెక్ట్ సిబ్బంది అయిన ప్రాజెక్ట్ మేనేజర్,డిస్ట్రిక్ట్ ప్రాజెక్ట్ మేనేజర్లు, ఏపియంలు, సీసీలు, వీఓఏలు హాజరయ్యారు.

న్యాయం చేయండి (1వ పేజీ తరువాయి)

పిట్టా ప్రసాద్,వేలేరుపాడు,జంగారెడ్డిగూడెం మండల కార్యదర్శులు బాడిశ రామ, రమణ రాజు, జిల్లా కౌన్సిల్ సభ్యులు పిట్టా వీరయ్య,బంధం నాగేశ్వరరావు, వంజం రామ, మడకం విజయ్, భీమరాజు, మడకం దేశమ్మ, బంధం చుక్కమ్మ, గంగాదేవి,బంధం జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

వాతావరణ హెచ్చరికలతో అధికారులు అప్రమత్తంగా ఉండాలి

రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి అధికారులకు ఆదేశం

విశాలాంధ్ర-నూజివీడు: వాతావరణ శాఖ హెచ్చరికల నేప థ్యంలో జిల్లా అధికారులు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అధికారులను ఆదేశించారు. కోస్తా జిల్లాలలో భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ఏలూరు జిల్లాలోని అన్ని శాఖల జిల్లా అధికారులు సమన్వయంతో

పనిచేయాలన్నారు.త్రాగునీరు, పారిశుధ్యం, విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవా లన్నారు.వ్యవసాయ, పశు సంపద, తోటలు,చెట్లు పడిపోవడం, విద్యుత్ లైన్లు దెబ్బ తినడం వంటి సమాచారంపై సంబంధిత జిల్లా అధికారులు తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని ఆదేశం చారు. ముఖ్యంగా వ్యవసాయ, పశు సంవర్థక మత్స్య,ఉద్యానవన, విద్యుత్,రహదారులు,భవనాల శాఖల అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండి వాతావరణ కేంద్రం హెచ్చరికలకు అనుగు ణంగా చర్యలు తీసుకోవాలన్నారు.

ఇంటర్‌లో ప్రవేశాలు కల్పించండి

విశాలాంధ్ర -కామవరపుకోట: కామవరపుకోటలోని శ్రీ వెంకటేశ్వర జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలు కల్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. మంగళవారం కామవరపుకోట, పరిసర గ్రామాల విద్యార్థుల తల్లిదండ్రులు జూనియర్ కళాశాల ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ తమ పిల్లలు 10వ తరగతి ఉత్తీర్ణులయ్యారని, దూర ప్రాంతాలకు పంపాలంటే ఆర్థిక స్తోమత లేదని ప్రభుత్వానికి చెందిన శ్రీ వెంకటేశ్వర జూనియర్ కళాశాలలో చేర్పే ఉద్దేశ్యంతో గత 10 రోజులనుండి కార్యాల యం చుట్టూ తిరిగినా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, కార్యాలయ సిబ్బంది ద్వారకాతిరుమల దేవస్థాన ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ వారి నుండి అనుమతి రాలేదని,వారి అనుమతి వచ్చిన తర్వాత ప్రవేశాలు ఇస్తామంటూ కాలయాపన చేస్తున్నారని తెలిపారు. కళాశాల యాజమాన్యం అలసత్వం కారణంగా తమ పిల్లల ఉన్నత చదు వుల భవిష్యత్తు కోల్పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.42 సంవత్సరాల చరిత్ర కలిగిన ఈ జూనియర్ కళాశా లను మూసివేసే ప్రయత్నాన్ని విరమింపజేసి, పిల్లలకు ఇంటర్ చదువుకుప్రవేశాలు కల్పించి న్యాయం చేయాలని కోరారు.

అభివృద్ధి పథంలో డ్వాక్రా సంఘాలు

విశాలాంధ్ర -ఏలూరు: రాష్ట్ర సెర్ప్ సీఈఓ కరుణ వాకాటి ఏలూరు జిల్లాలో స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళల ఆర్థికాభివృద్ధిని పరిశీలించేందుకు మంగళవారం ఏలూరు జిల్లాలో పర్యటించారు.ఈ సందర్భంగా ఏలూరు స్థానిక రెవిన్యూ అతిథి గృహానికి చేరుకున్న కరుణ వాకాటిని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి పూలమొక్కను అందించి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలో స్వయం సహాయక సంఘాల మహిళలకు

అందిస్తున్న రుణాలు, వాటిని వారు ఏ విధంగా సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారన్న విషయాలను జిల్లా కలెక్టర్ వెట్రిసెల్విను కరుణ వాకాటి అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ ఏలూరు జిల్లాలో స్వయం సహాయక సంఘ మహిళలకు బ్యాంకుల ద్వారా రుణాల ద్వారా స్వయం ఉపాధి యూనిట్లు స్థాపించుకుని అభివృద్ధి పథంలో వెళుతున్నారని, రుణాల రికవరీ కూడా 99 శాతానికి పైగా ఉందని, బ్యాంకులు కూడా డ్వాక్రా సంఘాలకు రుణాలు అందించేందుకు ఆసక్తి చూపుతున్నాయని చెప్పారు.

లేసు అల్లికదారులు ఆర్థిక స్వావలంబన సాధించాలి

కలెక్టర్ చదలవాడ నాగరాణి

విశాలాంధ్ర-నరసాపురం: లేసు అల్లికలలో వినియోగదారులకు అనుగుణంగా కొత్త డిజైన్లు రూపొందించాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి పేర్కొన్నారు. మంగళవారం నరసాపురం మండలం రుస్తుంబాద అలంకృతి లేసు పార్కును జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ జరుగుతున్న డిజైన్ వర్క్ షాప్‌లో పాల్గొని లేస్ అల్లికల మీద శిక్షణ పొందుతున్న మహిళలు అల్లిన పలు విధాల లేసు డిజైన్లను ఆమె పరిశీలించారు. లేస్ అల్లికల శిక్షణ పొందే మహిళలు, బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లతో మాట్లాడి పలు సూచనలు సలహాలను ఇచ్చారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ లేసు అల్లికలలో మహిళలు ఆర్థిక స్వావలంబన దిశగా పయనించాలని అన్నారు. వినియోగ దారుల అభిరుచికి అనుగుణంగా కొత్త డిజైన్లను రూపొందించాలని తెలిపారు. ప్రత్యేకించి గృహాలలో అలంకరించుకునే లేస్ డిజైన్లను, టేబుల్ పై వేసుకునే డిజైన్లు, పిల్లలు, మహిళలు, ధరించే లేస్ డిజైన్లపై ఎక్కువ దృష్టి సారించాలని అన్నారు.అల్లిన లేసు దుస్తులను ఆన్లైన్లో అప్లోడ్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో దాసిరాజు,జిల్లా డిఆర్డిఏ పిడి ఎంఎస్ఎస్ వేణుగోపాల్, తహసిల్దార్ అయితం సత్యనారాయణ, బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లు,లేసు శిక్షణ మహిళలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చెరువు పూడిక తీత పనులు వేగవంతం

అయ్యపరాజుగూడెం మాలకుంట చెరువు అభివృద్ధి

విశాలాంధ్ర-లింగపాలెం: అయ్యపరాజు గూడెంలోని మాలకుంట చెరువు పూడిక పనులు ఉపాధి పథకంలో వేగ వంతంగా జరుగుతున్నాయి. దాదాపు 150 ఎకరాల ఆయకట్టు ఉన్న ఈ చెరువు పూడికపడి నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోవడంతో దశాబ్దాల కాలంగా ఆయకట్టు భూములకు పూర్తిస్థాయిలో సాగునీరు అందటం లేదు. ఈ చెరువును ఉపాధి పథకంలో పూడిక తీసేందుకు అనుమతి ఇవ్వడంతో పూడిక పనులు చేస్తున్నారు. ఈ చెరువులోకి నీరు చేరితే గ్రామంలోని తాళ్లచెరువుకు నీరు చేరుతుంది. బాపిరాజు గూడెంలోని పెద్ద చెరువుకు నీరు సరఫరా అవుతుంది. ఈచెరువుకు ప్రాధాన్యత ఉన్నప్పటికీ ఇప్పటి వరకు అభివృద్ధికి నోచుకో లేదు.గతంలో ఉపాధి పథకంలో పూడికతీత పనులు చేసినా అవి నామమాత్రంగానే ఉన్నాయి. ఈఏడాది చెరువు అభివృద్ధిపై దృష్టి పెట్టారు.దీంతో పనులు చురుకుగా సాగుతున్నాయి. చెరువులో కొంత భాగాన్ని పూడిక తీయడం ఇప్పటికే జరిగింది. పూర్తిస్థాయిలో ఈ చెరువును పూడిక తీయాలని ఉపాధి పథకం అధికారులు భావిస్తున్నారు.ఈచెరువు పూడిక తీయటం వల్ల నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుంది. గ్రామంలో భూగర్భ జలాలు పెరుగుతాయి. ఈచెరువు గర్భాన్ని ఆక్రమించుకోవడం వల్ల పూర్తిస్థాయిలో పూడిక పనులు చేయటానికి సాధ్యం కాని పరిస్థితి నెలకొంది. చెరువు అభివృద్ధి చెందాలంటే ఆక్రమణలు తొలగించాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

సీపీఐ ఏలూరు జిల్లా మహాసభలు విజయవంతం చేయాలి

విశాలాంధ్ర- చింతలపూడి : భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ఏలూరు జిల్లా ద్వితీయ మహాసభలు జూలై 5 6 7 తేదీలలో చింతలపూడి పట్టణంలో జరుగుతున్నాయని వాటిని జయప్రదం చేయాలని ఆహ్వాన సంఘం అధ్యక్షులు మామిళ్ళపల్లి వసంతరావు పిలుపునిచ్చారు. మంగళవారం సిపిఐ కార్యాలయంలో మహాసభల కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో భారత కమ్యూనిస్టు పార్టీ ఏర్పడి 100 సంవత్సరాలు అయ్యిందని చింతలపూడి తాలూకాలో సిపిఐ ఏర్పడి 84 సంవత్సరాలు కావస్తుందని ఆయన తెలిపారు. ఇప్పటికీ జిల్లా మహాసభలు ఇక్కడ నిర్వహించలేదని మొట్టమొదటిసారిగా చింతలపూడి ప్రాంతంలో జిల్లా మహాసభలు జరుపుతున్నామని అన్నారు. చింతలపూడి తాలూకాలో అసైన్మెంట్ భూములు మిగులు భూముల చట్టాల అమలుకు ఆందోళన చేసి బినామీ ఎస్సైన్మెంట్ పట్టాల రద్దుకై సీపీఐ పోరాడిందని తెలిపారు. ప్రభుత్వ బంజరు పోరంబోకు భూములు సర్వోదయ భూములు ల్యాండ్ ఫార్మింగ్ సొసైటీ భూములు సోషల్ ఫారెస్ట్ జీడిమామిడి తోటల భూములను వేలాది ఎకరాలను పోరాటాల ద్వారా పేదలకు పంచామని అన్నారు. అటవీ బంజరులను చెట్టు పట్టా పథకం కింద భూమిలేని పేదలకు ఇవ్వాలని మూడు దశాబ్దాల పాటు సమరశీల పోరాటాలు నడిపి ప్రభుత్వంతో వన సంరక్షణ సమితులను పెట్టించి అటవీ బంజరులను ఆయా గ్రామాల పేదలకు దక్కేందుకు సీపీఐ పోరాడిందని తెలిపారు. మహాసభల జయప్రదానికై ప్రతి ఒక్కరూ సహాయ సహకారాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కంచర్ల గురవయ్య, సిపిఐ మండల కార్యదర్శి తొర్లపాటి బాబు, సహాయ కార్యదర్శి దొంతా కృష్ణ, ఎస్కే మస్తాన్, ఎం.అలెగ్జాండర్, తాడిగడప మాణిక్యాలరావు, మోర్తా అమ్ములు, ఏఐవైఎఫ్ జిల్లా కోకన్వీనర్ తొర్లపాటి రాజు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణం కాపాడటంలో తేనెటీగల పాత్ర కీలకం

విశాలాంధ్ర -భీమవరం టౌన్ : పర్యావరణంలో సమతుల్యతను కాపాడటంలో తేనెటీగల పాత్ర కీలకమని, తేనెటీగలు అంతరించిపోతే ఆహార కొరత ముప్పు తప్పదని భీమవరం ఎంపిడివో ఎన్. మురళీ

గంగాధరరావు, మండల వ్యవసాయ అధికారి నిమ్మల శ్రీనివాస రావు, పర్యావరణ శాస్త్రవేత్త మాట్లపూడి సత్యనారాయణ అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో భీమవరం ఎంపిడివో కార్యాలయంలో మంగళవారం ప్రపంచ తేనెటీగల దినోత్సవాన్ని నిర్వహించారు. మురళీ గంగాధరరావు మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా తేనెను ఎక్కువగా ఉపయోగిస్తారని, చాలా మంది తేనెటీగల పెంపకంపై ఆధారపడి కూడా జీవిస్తున్నారన్నారు. భూమిమీద తేనెటీగలు లేకపోతే మనిషి జీవితం దుర్భరమవుతుందని లండన్ శాస్త్రవేత్తలు కూడా చెబుతున్నారని అన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ తేనె ఎంత రుచికరమో అంత ఆరోగ్య దాయకమని, ప్రతిరోజు తగిన మోతాదులో తేనెను తీసుకోవడం ద్వారా పలు అనారోగ్యాల బారి నుంచి బయటపడవచ్చునని అన్నారు. . కార్యక్రమంలో ఎంఈవో ఎన్. శ్రీనివాసరావు, ఏవో రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కాలువల మరమ్మతులు తక్షణం పూర్తి చేయాలి

విశాలాంధ్ర-ఏలూరు: కాలువల మరమ్మతు పనులను సత్వరమే పూర్తి చేయాలని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ నీటిపారుదల శాఖ అధికారులను సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ అతిథి గృహంలో ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటితో కలిసి దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, నీటిపారు

దల శాఖ ఇంజనీరింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు.ఈ సంద ర్భంగా చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ ఏలూరు, దెందులూరు నియోజకవర్గాలలో గోదావరి కృష్ణ కెనాల్ లకు టెయిల్ ఎండ్‌గా ఉండడంవల్ల రైతులు తీవ్ర ఎక్కట్లే ఎదుర్కొంటు న్నారని,ఈ నేపథ్యంలో అటు గోదావరి కెనాల్,ఇటు కృష్ణ కెనాల్ కు సంబంధించినటువంటి పూడికతీత సహా సంబంధిత మరమ్మత్తులతో పాటు పలు చోట్ల అధ్వాన్న స్థితిలో ఉన్న గేట్లను కూడా కొత్తవి ఏర్పాటు చేసే పనులన్నీ కూడా సత్వరమే పూర్తి అయ్యేలా చర్యలు చేపట్టాలని సూచించారు.అనంతరం చింతమనేని ప్రభాకర్, ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటికి జడ్పీ అతిథి గృహం వద్ద పలువురు తమ వినతి పత్రాలను అందించి, సమస్యలను విన్నవించారు. ఈ సందర్భంగా వారి వినతులను స్వీకరించిన ఎమ్మెల్యేలు వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేలా చర్యలు చేపడతా మన్నారు.

ఉర్దూ యూపీ పాఠశాలను కొనసాగించాలి

విశాలాంధ్ర-ఏలూరు: పాఠశాలల పునర్నిర్మాణ ప్రక్రియలో భాగంగా ఏలూరు మండలం లోని శనివారపుపేట ఉర్దూ యూపీ పాఠశాలను కొనసాగించాలని ఆ పాఠశాల పేరెంట్స్ కమిటీ, ముస్లిం మత పెద్దలు దెందులూరు శాసనసభ్యులు చింతమనేని ప్రభాకర్‌ను కోరారు. గత 25 సంవత్సరాల క్రితం ఈ పాఠశాల ప్రాథమిక పాఠశాల

నుండి ప్రాథమికోన్నత పాఠశాలగా అప్ గ్రేడై వేలాది మందికి విద్యనందించిందన్నారు.పాఠశాల స్థాయి ని తగ్గిస్తే తమ పిల్లలు చదువు కు దూరం కావలసి వస్తోందని,ముస్లిం మైనార్టీ విద్యార్థులు డ్రాప్ అవుట్ గా మారే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ పాఠశాల డీగ్రేడ్ చేయడం వలన తమ పిల్లలు 6 వ తరగతి వెళ్లాలంటే 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఉర్దూ మీడియం హై స్కూల్, ఏలూరు వెళ్ళాలని ఆందోళన చెందుతున్నారు. తక్షణం జిల్లా యంత్రాంగం స్పందించి ఉర్దూ యుపి పాఠశాలను కొనసాగేలా చర్యలు చేపట్టాలని శాసనసభ్యులు చింతమనేని కోరారు.

బీసీ రుణాలు అర్హత ప్రామాణికంగా ఇవ్వాలి

శాసనమండలి సభ్యులు వంక రవీంద్రనాథ్

విశాలాంధ్ర-తణుకు: బీసీ రుణాలను అర్హత ప్రామాణికంగా తీసుకుని ఇవ్వాలని శాసనమండలి సభ్యులు వంక రవీంద్రనాథ్ కోరారు. ఏలూరులో జరిగిన జిల్లా సమీక్షా సమావేశంలో శాసనమండలి సభ్యులు వంక రవీంద్రనాథ్ మాట్లాడుతూ శాసనసభ్యుల సిఫారసుతో బీసీ రుణాలు మంజూరు చేయడం సరైన విధానం కాదన్నారు. గత ప్రభుత్వ హయాంలో సెకండ్ ఫేస్ లో స్కూల్ భవనాల నిర్మాణాలు ఆగిపోయాయని, నిర్మాణ దశలో ఉన్న భవనాలు ఆగిపోతే ప్రజాధనం వృథా అవుతుందని, విద్యార్థులు ఇబ్బందులు పడతారని తక్షణం ఆగిపోయిన భవన నిర్మాణాలను నిర్మించాలని విజ్ఞప్తి చేశారు.జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు కొనుగోలు కేంద్రాలు ఇబ్బందులు పెడుతున్నాయని,ఈ సమస్య రాకుండా ఉండేందుకు చర్యలు తీసుకోవాలని రవీంద్రనాథ్ కోరారు.

కార్మిక హక్కుల పరిరక్షణకు పోరాటం ఉధృతం

విశాలాంధ్ర - తాడేపల్లిగూడెం : కార్మిక హక్కుల పరిరక్షణ కోసం పోరాటాన్ని ఉధృతం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.సోమసుందర్ పిలుపునిచ్చారు.కేంద్ర కార్మిక సంఘాల ఐక్యవేదిక పిలుపు మేరకు ఏఐటీయూసీ ఏరియా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని పలు కార్మిక కేంద్రాల్లో ప్రదర్శనలు, ధర్నాలు, గేటు సమావేశాలు జరిగాయి. ఉదయం మునిసిపల్ కార్మికులు మునిసిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేసి, ర్యాలీ నిర్వహించారు. సి.డబ్ల్యు.సి., ఎస్.డబ్ల్యు.సి. గోడౌన్ల జట్టు కార్మికులు తమ గోడౌన్ల ఎదుట ధర్నా చేశారు.మార్కెట్ యార్డు హమాలీలు యార్డు వద్ద, ఏరియా ఆసుపత్రి పారిశుధ్య,సెక్యూరిటీ విభాగాల కాంట్రాక్ట్ సిబ్బంది ఆస్పత్రి గేటు వద్ద నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాలుగు లేబర్ కోడ్లను రద్దుచేసి పాత కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని,సెంట్రల్ పే కమిషన్ ఏర్పాటు చేయాలని,రాష్ట్రంలో పీఆర్సీని వెంటనే ప్రకటించాలని,కనీసవేతనం రూ.35 వేలు ఇవ్వాలని, ఉద్యోగాలను అక్రమంగా తొలగించే విధానాలను విడనాడాలని, కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ సిబ్బందిని పర్మనెంట్ చేయాలని,విశాఖ ఉక్కు కార్మికుల సమస్యలను పరిష్కరించి వారి సమ్మెను నివారించాలని, ప్రభుత్వం ప్రైవేటీకరణ విధానాలను విడనాడాలని డిమాండ్ చేస్తూ కార్మికులు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జరిగిన వివిధ సమావేశాలలో ఏఐటీయూసీ నాయకులు మాట్లాడుతూ మే 20 న

తలపెట్టిన సార్వత్రిక సమ్మెను జూలై 9 వ తేదీకి వాయిదా వేయడానికి దారితీసిన పరిస్థితులను వివరించారు. తర్వాతి సమ్మెకు సన్నద్ధం కావాలని కోరారు.ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.సోమ సుందర్ మాట్లాడుతూ సార్వత్రిక సమ్మె జరుపనున్నట్లు ప్రకటించిన తర్వాత కూడా పారిశ్రామిక సంస్థల్లో ఉద్యోగుల తొలగింపు విచ్చలవిడిగా సాగుతోందని, ప్రభుత్వాలు, యాజ మాన్యాలు కార్మికుల,ఉద్యోగుల హక్కులను హరిస్తున్నాయని అన్నారు.సైనిక చర్యల నేపథ్యంలో సమ్మెను వాయిదా వేసినప్పటికీ , వివిధ రూపాలలో నిరసనలు , పోరాటాలు కొనసాగిస్తామని అన్నారు. ఏఐటీయూసీ ఏరియా అధ్యక్షుడు ఓసూరి వీర్రాజు మాట్లాడుతూ ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న కార్మిక చట్టాల రద్దు, నాలుగు లేబర్ కోడ్లు అమలు ద్వారా కార్మికహక్కులు నిర్వీర్యం అవుతున్నాయని అన్నారు. కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

ఏఐటీయూసీ ఏరియా కమిటీ కార్యదర్శి మందలపర్తి హరీష్ మాట్లాడుతూ అసంఘటిత కార్మికులకు, కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ సిబ్బందికి జీవన స్థితిగతులు దుర్భరంగా ఉన్నాయని, వారికి కనీస వేతనాలు అమలు జరగడం లేదని , ఉద్యోగభద్రత కరువయ్యిందని అన్నారు. వ్యవసాయ కార్మికసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కళింగ లక్ష్మణరావు మాట్లాడుతూ మోదీ ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతిఘటిస్తూ పోరాటాలను కొనసాగించాలని, జులై 9 వ తేదీ సమ్మెను విజయవంతం చేయడానికి ఇప్పటి నుంచి సన్నాహాలు చేయాలని అన్నారు.మునిసిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కోశాధికారి తాడికొండ శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కొత్త పీఆర్సీ ప్రకటించాలని, కనీసవేతనం 35 వేలుగా నిర్ణయించాలని డిమాండ్ చేశారు.కార్యక్రమానికి ఏఐటీయూసీ నాయకులు అల్లం కుమారస్వామి, ముత్యాల జగదీష్, కొడమంచిలి చంద్రరావు, కాటమరాజు, తాడికొండ కనకలక్ష్మి, మండేలా జయసుధ, పెనుమాక విజయ, ఏడిద నాని, కళింగ శ్రీనివాస్, రౌతు రాజేష్, గోకా నాగరాజు, తాడేపల్లి వెంకటేష్, యాలం నర్సన్న, గాది అంజిబాబు, చర్ల వెంకటరెడ్డి, పాతాల నాగేశ్వరరావు, కుంచె ఏడుకొండలు, మాదాసు సత్యనారాయణ, యాంద్ర ఆంజనేయులు, జయరాజు, మేళం నాగరాజు, విజయకుమార్, ప్రసాద్ అంబేద్కర్, సాగర్ బాబు, కుమారి, సురేష్, రాంబాబు, నాగేంద్ర, తదితరులు నాయకత్వం వహించారు.

డ్వాక్రా సంఘాలకు రూ.2182.16 కోట్ల రుణ ప్రణాళిక

సెర్ప్ సీఈవో కరుణ వాకాటి

విశాలాంధ్ర-ఏలూరు: ఏలూరు జిల్లాలో డ్వాక్రా సంఘాల సభ్యులకు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ. 2182. 16 కోట్ల రుణ ప్రణాళిక లక్ష్యంగా నిర్దేశించినట్టు సెర్ప్ సీఈఓ కరుణ వాకాటి చెప్పారు. స్థానిక వట్లూరులోని

టిటిడిసిలో మంగళవారం డీఆర్డీఏ అధికారులు, సిబ్బంది,డ్వాక్రా సంఘాల సభ్యులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ కె. వెట్రిసెల్వితో కలిసి కరుణ వాకాటి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కరుణ వాకాటి మాట్లాడుతూ జిల్లాలోని స్వయం సహాయక సంఘాల మహిళల జీవనోపాధుల నిమిత్తం స్వయం ఉపాధి కార్యక్రమాలకు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.2182.16 కోట్లు రుణాలుగా అందించడం జరుగుతుందన్నారు. దీనికోసం వార్షిక జీవనోపాధుల రుణ ప్రణాళిక సర్వే,సూక్ష్మ రుణ ప్రణాళిక తయారీలో డ్వాక్రా సంఘ సభ్యులకు అవగాహన కలిగించడం, తదితర అంశాలపై అవగాహన కలిగించారు. రుణాలు పొందే డ్వాక్రా సంఘాల సూక్ష్మ రుణ ప్రణాళికలను ఈ నెలాఖరులోగా రూపొందించేలా చర్యలు తీసుకోవాలన్నారు.సూక్ష్మ రుణ ప్రణాళికల రూపకల్పన, లబ్దిదారుల ఎంపికలో హార్టికల్చర్, ఫిషరీస్,పశు సంవర్ధక,పరిశ్రమల శాఖ మొదలగు శాఖల సమన్వయంతో పనిచేయాలని చెప్పారు. జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలో డ్వాక్రా సంఘాలు అభివృద్ధి బాటలో పయనిస్తున్నాయని, డ్వాక్రా సంఘాల మహిళలకు మంజూరుచేసిన రుణాలు 99 శాతానికి పైగా వసూలవుతున్నాయన్నారు. రుణాలు సద్వినియోగం చేసుకుని డ్వాక్రా సంఘాల మహిళలు ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నారని చెప్పారు.డి.ఆర్.డి.ఏ ప్రాజెక్ట్ డైరెక్టర్, డాక్టర్ ఆర్. విజయరాజు, ప్రాజెక్ట్ మేనేజర్, డిస్ట్రిక్ట్ ప్రాజెక్ట్ మేనేజర్లు,ఏపియంలు, సీసీలు,వివిఏ లు, తదితరులు హాజరయ్యారు.

17 పంచాయతీల్లో నూరుశాతం పన్ను వసూళ్లు

- లక్ష్యాలు చేరుకోని వైనం
- లక్షలాది రూపాయల బకాయిలు
- బడాబాబులు టెంపరితనం
- కోర్టు లిటిగేషన్లు

విశాలాంధ్ర -భీమవరం: నూటికి నూరు శాతం పంచాయతీలు పన్నులు వసూలు చేస్తేనే గ్రామాభివృద్ధి చెంది స్వావలంబన సాధిస్తారని ఆదిశగా పన్ను వసూళ్లు జరగాలని అధికారులు ఎప్పటికప్పుడు నిర్దేశిస్తూనే ఉన్నారు. కోర్టు వివాదాలు, సిబ్బంది అలసత్వం, బడాబాబులు పన్ను డిమాండ్ నోటీసులను పట్టించుకోకపోవడం వెరసి పన్ను వసూళ్లు నూరు శాతం చేరుకోలేకపోతున్నాయి. జిల్లాలో సుమారు 409 వరకు మైనర్, మేజర్ పంచాయతీ లున్నాయి. మేజర్ పంచాయతీలు, పట్టణాలకు చేర్చి ఉన్న పంచాయతీల్లో లక్షలాది రూపాయలు పన్నులు వసూళ్ళు కాకపోవడంతో ఆయా పంచాయతీల్లో మౌలిక వసతులు కల్పించేందుకు, సిబ్బంది జీతభత్యాలు చెల్లించడానికి అవరోధంగా మారింది. నూరు శాతం పన్ను వసూళ్లకు యజమానులకు పన్ను రాయితీలు, రిబేట్లు ప్రభుత్వం ప్రకటిస్తున్నా, ఆయా పంచాయతీలకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు ప్రకటిస్తున్నా ఫలితాలు కానరావడంలేదు. ఈ నేపథ్యంలో గత 2024-2025 ఆర్థిక సంవత్సరంలో సుమారు 17 పంచాయితీలు నూరు శాతం పన్నులు వసూలు చేసి పలు పంచాయితీలకు ఆదర్శంగా నిలిచాయి. వీటిలో కోమటితిప్ప, మొగల్తూరు, పాలకోడేరు, కొత్త నవరసపురం, మైప, వేండ్ర అగ్రహారం,చింతపర్రు, జగన్నాథపురం, మినీమించిలిపాడు, తూర్పు పాలెం, పి.పోలవరం, అప్పన్న చెరువు, వద్దిపర్రు, తోకలపూడి, దరిసిపర్రు, అప్పారావుపేట,కృష్ణయ్య పాలెం గ్రామ కార్యదర్శులకు అధికారుల చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందుకుని స్ఫూర్తిగా నిలిచారు.

వేసవి సెలవుల్లో పిల్లలు జాగ్రత్త!

విశాలాంధ్ర-జీలుగుమిల్లి : పోలవరం నియోజకవర్గ పరిధిలో ఉన్న తల్లి దండ్రులు పిల్లలకు వేసవి సెలవులు నేపథ్యం లో వారి పట్ల తగు జాగ్రత్తలు తీసుకొని ఎటు వంటి హాని జరగ కుండా చూసు కోవాలని

పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు తెలియజేశారు. ఏలూరు జిల్లా వ్యాప్తంగా ఇటీవలే జరిగిన పలు సంఘటనల్లో ప్రాణాలు కోల్పోయిన వారి పట్ల దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నట్లు బాలరాజు తెలిపారు. వేసవి సెలవుల నేపథ్యం లో విహార యాత్రలకు,పలు ప్రాంతాలు సందర్శనలకు వెళ్ళేటప్పుడు తల్లిదండ్రులు తమ పిల్లల పట్ల సరైన జాగ్రత్తలు తీసుకొని వారి కదలికలను గమనిస్తూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు.ఇటీవలే జిల్లా వ్యాప్తంగా వేరు వేరు సంఘటనలలో నిర్లక్ష్యం గా ప్రాణాలు కోల్పోయిన వారి సంఖ్య 20 మంది కి చేరడం బాధాకరం అని,ముందస్తుగా వారిపట్ల బాధ్యతగా వ్యవహరించి ఉంటే ప్రాణ నష్టం తీవ్రత తగ్గేదన్నారు. కొన్ని రోజుల క్రితం బుట్టాయిగూడెం మండలం దొరమామిడి అలివేరు ప్రాజెక్టులో ప్రమాదవశాత్తు ఇద్దరు చిన్నారులు మృతి చెందిన ఘటన కలచి వేసిందని అన్నారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

10న ఆక్వా రైతుల చలో అమరావతి

విశాలాంధ్ర - పాలకొల్లు: పాలకొల్లు మండల పరిధిలోని చందపర్రు గ్రామంలో ఎస్.ఎస్.ఎస్ కళ్యాణ మండపంలో జై భారత్ క్షీరా రామ ఆక్వా రైతు సంఘం కార్యవర్గ సమావేశం మంగళవారం జరిగింది. ఈ సమావేశానికి సంఘ అధ్యక్షులు గొట్టుముక్కల గాంధీ భగవాన్ రాజు అధ్యక్షత వహించి మాట్లాడారు. గాంధీ రాజు మాట్లాడుతూ ఆక్వా రైతులు రొయ్య సరైన ధర లేక, మేత ధరలు విపరీతంగా పెరిగి, తీవ్రమైన అప్పుల ఊబిలో కూరుకు పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జై భారత్ క్షీరా రామ ఆక్వా రైతు సంఘం ఆధ్వర్యంలో.. ఇప్పటికే 20 వేల ఎకరాల మేర, ఆక్వా సాగుకు రైతులు స్వచ్ఛందంగా పంట విరామం ప్రకటించారని తెలిపారు. ఆక్వా రైతుల సమస్యలు ప్రభుత్వానికి తెలిసేలా జూన్ 10న చలో అమరావతి కార్యక్రమాన్ని నిర్వహిస్తు న్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో పెన్మత్స వెంకట సత్యనారాయణ రాజు, ఎస్ వి వి సత్యనారాయణ (బుజ్జి), సుధీర్ రెడ్డి, బోనం చినబాబు, బోనం రంగయ్య నాయుడు, దాట్ల సోంబాబు, అంగర వరప్రసాద్, రుద్రరాజు సత్యనారాయణ రాజు తదితరులు పాల్గొన్నారు.

అవగాహన కల్పించాలి (1వ పేజీ తరువాయి)

పర్యవేక్షించాలన్నారు. చెవి, ముక్కు, గొంతు ఆపరేషన్లకు సంబంధించి అవసరమైన మిషన్లు వైద్య సేవ నిధుల ద్వారా కొనుగోలు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. గుండెపోటు వచ్చిన సమయంలో ప్రాణాపాయ స్థితి నుండి కాపాడడానికి రూ.45 వేలు విలువైన తేనిప్లెక్టసే ఇంజక్షన్ ఉచితంగా చేయడం జరుగుతుందని కలెక్టర్ దృష్టికి తీసుకురాగా ఈ ఇంజక్షన్ గురించి వైద్య సిబ్బంది ద్వారా అందరికీ తెలిసే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కుక్కకాటు, పాము కాటుకు సంబంధించిన ఇంజక్షన్లు ఎప్పుడు ఆసుపత్రిలో అందుబాటులో ఉండే విధంగా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్డిఓ దాసిరాజు, డి సి హెచ్ ఎస్ పి.సూర్యనారాయణ,ఆస్పత్రి కమిటీ సభ్యులు డాక్టర్ ఎం.కోటేశ్వరరావు,డాక్టర్ ఎనుముల సతీష్,పోలిశెట్టి నళిని, ఆసుపత్రి సూపరింటెండెంట్ సంపత్ కుమార్, డాక్టర్లు, మున్సిపల్ కమిషనర్ అంజయ్య, తహసీల్దార్ సత్యనారాయణ,ఆస్పత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తనిఖీ (1వ పేజీ తరువాయి)

నిర్వహణ విషయంలో స్టాక్ నిర్వహణ, రిజిస్టర్ల నిర్వహణను పరిశీలించినట్టు తెలిపారు. స్టాక్ పాయింట్లో ఉన్న స్టాక్ , రిజిస్టర్ ప్రకారం సరిగ్గా ఉందో లేదో క్షుణ్ణంగా పరిశీలన చేసి నివేదిక అందచేయాలని ఆర్డీవో రాణి సుస్మితను కలెక్టర్ ఆదేశించారు. అనంతరం కొవ్వూరు పట్టణంలోని పలు చౌక ధరల దుకాణాన్ని పరిశీలించిన కలెక్టర్, అక్కడ వినియోగదారులతో మాట్లాడారు. ప్రజా పంపిణీ వ్యవస్థ పనితీరు, డెలివరీ యూనిట్స్ ద్వారా ఇంటి వద్దనే సరుకుల పంపిణీ పై వినియోగదారులు సంతృప్తి వ్యక్తం చేసినట్టు కలెక్టర్ తెలిపారు. రెవెన్యూ డివిజనల్ అధికారి రాణి సుస్మిత తనిఖీ చేసిన స్టాక్ వివరాలు తెలియ చేస్తూ ప్రజా పంపిణీ వ్యవస్థ, ఐ సి డి ఎస్ ద్వారా ఏం ఎస్ ఎల్ పాయింట్లో స్టాక్ స్వోరెక్స్ రైస్ 19245 సంచులలో 959.328 మెట్రిక్ టన్నులు, ఫోర్టిఫైడ్ రైస్ 14.244 మెట్రిక్ టన్నులు, చక్కెర 58.494 మెట్రిక్ టన్నులు , కందిపప్పు పిడిఎస్ , ఐసిడిఎస్ లు 11.882 మెట్రిక్ టన్నులు , పిడిఎస్ 2.427 మెట్రిక్ టన్నులు పామ్ ఆయిల్ 1049 లీటర్ ప్యాకెట్, 7219 అర లీటర్ ప్యాకెట్ లు స్టాక్ మేరకు సరిపోయినట్లు తెలిపారు. ఈ పర్యటన లో కలెక్టర్ వెంట ఆర్డీవో రాణి సుస్మిత, చాగల్లు తహసీల్దార్ అమ్మాజీ, కొవ్వూరు తహసిల్దార్ ఎమ్. దుర్గా ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

గుంతలను పూడ్చిన ట్రాఫిక్ పోలీసులు

విశాలాంధ్ర - సామర్లకోట : సామర్లకోట రైల్వే స్టేషన్ సెంటర్ సమీ పంలో ఆర్ అండ్ బీ రోడ్డుపై ఏర్పడ్డ గుంతలను ట్రాఫిక్ పోలీసులు మంగళవారం పూడ్చారు. ఒక పక్క వర్షం వస్తున్నప్పటికీ ట్రాఫిక్ ఎస్ఐ అడపా గారగారావు ఆధ్వర్యంలో ట్రాఫిక్ పోలీసులు గోతులు పూడ్చారు. గోతులు కారణంగా ప్రమాదాలు సంభవించడంతో, తాత్కాలికంగా చర్య లు చేపట్టినట్లు ట్రాఫిక్ ఎస్ఐ గారగారావు తెలిపారు. ప్రజలు ప్రయాణికులు ట్రాఫిక్ పోలీస్ సేవలపై హర్షం వ్యక్తం చేశారు.

ఆదిత్యలో ప్రశాంతంగా ఏపిఈఏపి సెట్

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య వి ద్యా ప్రాంగణంలో ఏపిఈ ఏపిసెట్-2025 ఆన్లైన్ ఎగ్జామ్స్ రెండో రోజు ప్రశాంతంగా జరిగినట్లు ఆదిత్య యూని వర్సిటీ డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డా ఎం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఈ ఎగ్జామ్స్‌కు చీఫ్ సూపరింటెండ్‌గా ఆదిత్య ప్రో వైస్ ఛాన్స లర్ డా ఆదిరెడ్డి రమేష్ వ్యవహరించగా, ప్రో ఎం రాజబాబు, ప్రో టి శ్రీనివాసులు, ప్రో వీర ప్రసాద్ కో ఆర్డినేటర్లుగా నిర్వ హించారు. ఉదయం నుండి ఎడతెరిపి లేని వర్షం కురవడంతో ఆర్‌టిసిలో వచ్చిన విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగ కుండా మెయిన్ గేట్ నుంచి పరీక్షా కేంద్రాలకు ఆదిత్య యాజ మాన్యం తమ బస్సుల్లో తరలించడం పట్ల విద్యార్థుల తల్లి దండ్రులు ఆనందం వ్యక్తం చేశారు.

అదుపు తప్పి గుంతలో దిగబడిన ఆర్టీసీ బస్సు

విశాలాంధ్ర - రాజోలు : మండలంలోని చింతలపల్లి గ్రామంలోని ప్రధాన రహదారిలో మంగళవారం రాజోలు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు అదుపు తప్పి దిగబడిపోయింది. సఖినేటి పల్లి నుంచి అమలాపురం సుమారు 18మంది ప్రయాణికులతో వస్తుండగా ప్రమాదం జరిగింది. ఎవరికి ఏ విధమైన గాయాలు కాకుండా సురక్షితంగా బయట పడ్డారు. అధ్వానంగా ఉన్న ఈ రహదారిలో మంగళవారం వ ర్షం కురవడంతో ట్రాక్టర్‌కి సైడ్ ఇచ్చేందుకు బస్సు పక్కకు వెళ్ల గా దిగబడిందని ప్రయాణికులు తెలిపారు. రోడ్డు అభివృద్ధి పను లు పేరుతో ఇటీవల రోడ్డుకు ఇరువైపులా మట్టిని తవ్వి మళ్లీ పూడ్చివేశారు. రెండు రోజులుగా కురిసిన వర్షాలకు బస్సు దిగబడిపోయిందని స్థానికులు అంటున్నారు. కొన్నే ళ్లుగా ఈ రోడ్డు పూర్తి అధ్వానంగా మారడంతో ప్రయా ణి కు లు, వాహన దారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించి ఈ రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేయాలని కోరుతున్నారు.

చెత్త సంపద కేంద్రాల తనిఖీ

విశాలాంధ్ర - కరప : మండలంలోని కొంగోడు గ్రామంలో చెత్త నుండి సంపద కేంద్రా లను డిప్యూటీ ఎంపీడీవో సలాది వెంకట శ్రీనివాస రావు పరిశీలించినట్టు పేర్కొన్నారు. గ్రామంలో వున్న క్లాప్ మిత్రా ద్వారా తడి, పొడి చెత్తను విడివిడిగా సేకరించి చెత్త నుండి సంపద కేంద్రాలకు తరలించి సేంద్రియ ఎరువుల తయారీకి ఉపయోగించి, రైతు లకు ఉపయోగపడేలా సంపదను సృష్టించడం చేయాలన్నారు. పంచాయితీ కార్యదర్శి దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అమలాపురం మున్సిపాలిటీలో ఆకలి కేకలు

మూడు నెలలుగా జీతాలు లేక విలవిల

విశాలాంధ్ర - అమలాపురం : అమలాపురం మున్సిపాలిటీలో 70 మంది పారిశుద్ధ్య కార్మికులు మూడు నెలలుగా జీతాలు లేకుండా కడుపు కాలు తూ పనిచేస్తుంటే యాజమాన్యం జీతాలు ఇవ్వకుండా పారి శుద్ధ్య కార్మికులను ప్రస్తుత మలమల మాడుస్తోం దని, మున్సిపల్ కార్మికులు ఆకలితో హాల్ లక్షణ అని ఆం దోళన చెందుతున్నారనీ కావున వెంటనే వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. గత ప్రభుత్వం తీసు కొచ్చిన ఆప్కాస్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి స్థానిక సం స్థలు ఆదాయం రాష్ట్ర ప్రభుత్వానికి జమ చేసే విధానం ద్వారా ఆచరణలోకి తెచ్చింది. నేటి కూటమి ప్రభుత్వం రద్దు చేసి యోచనలో స్థానిక సంస్థల ఆదాయం స్థానిక సంస్థలకె అందించాలని ఉత్తర్వులు జారీచేశారు. ఈ నేపద్యములో ఆప్కాస్ సంస్థ ఎత్తివేత్త జరుగు తుందని ప్రచారంలో మున్సిపల్ వర్కర్స్‌ని కూడా సంస్థ కార్మి కులుగా పరిగణించి సంస్థ ద్వారా జీతాలు చెల్లించే విధంగా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయాలని, జనాభా ప్రతిపదికన కార్మికుల సంఖ్య ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. అపరిష్కృతం గా కార్మిక సమ స్యలు పరిష్కారానికి చర్యలు తీసుకో వాలని కోరారు. కార్మికుల వర్క్ ఎలాట్మెంట్ రిజిస్టర్ ఏర్పటు చేసి రోజు వారీ పనిని నమోదు చేసేందుకు కోరుతున్నాము. పర్మి నెంట్ కార్మికులకు ఇంక్రిమెంట్స్ అన్నాప్మెంట్ చెల్లిం పులు జరపడానికి చర్యలు చేపట్టా లని కోరుతున్నాము. కార్మికులకు చార్టెడ్ ఆఫ్ లీవు, మెడికల్ లీవు, ఆఫ్సెంట్ ఆయిన కార్మికుల స్థానే రిలీ వర్స ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నాము. పై సమస్యలు పరిష్కారానికి బుధవారం ఉదయం కమీష నర్ వారి కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నిమ్మకాయల శ్రీనివాసరావు, కొప్పుల బాబి పిలుపు ఇచ్చారు .

మండల టీడీపీ అధ్యక్షుడిగా కుసంపూడి రామకృష్ణంరాజు

విశాలాంధ్ర - ఆత్రేయపురం : మండల టిడిపి అధ్యక్షునిగా తాడిపూడి గ్రామానికి చెందిన కుసంపూడి రామకృష్ణంరాజు (బాబు)ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోమవారం కొత్తపేటలోని కృష్ణదేవరాయ కాపు కళ్యాణ మండపంలో జరిగిన మినీ మహానాడు అనంతరం కొత్తపేట నియోజక వర్గ పరిధిలోని నాలుగు మండలా లకు టిడిపి అధ్యక్షులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అధ్యక్షతన జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆత్రేయపురం మం డల టిడిపి అధ్యక్షునిగా కుసంపూడి రామకృష్ణంరాజు (బాబు)ను తెలుగు రైతు అధ్యక్షులుగా కరుటూరి వర ప్రసాద్ ఐటిడిపి అధ్యక్షుడిగా మధు తెలుగు యువత అధ్యక్షులుగా వెచ్చ అనిల్ బీసీ సెల్ అధ్యక్షులుగా మిద్దె రామకృష్ణలను నాయకులు కార్యకర్తలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మం డల టిడిపి నాయ కులు ముదునూరి వెంకటరాజు, ముళ్ళపూడి భాస్కర రావు, కరుటూరి నరసింహారావు, మద్దూరి సుబ్బారావు, మండల పరిధిలోని 17 గ్రామాలకు చెందిన టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఆత్రేయపురం మండల టిడిపి అధ్యక్షుడిగా ఎన్నికైన కుసంపూడి రామ కృష్ణం రాజు (బాబు)కు పలువురు నాయకులు, కార్య కర్తలు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా రామ కృష్ణం రాజు మాట్లాడుతూ తనపై నమ్మకముతో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అప్పగించిన బాధ్యతలను పార్టీ ఆదేశాలను, శిరసావహిస్తూ నాయకులను, కార్యక ర్తలను కలుపుకొని టిడిపిను మరింత బలోపేతానికి శాయశక్తుల కృషి చేస్తానని అన్నారు.

కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలి

విశాలాంధ్ర - నిడదవోలు : జూలై 9న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు మంగళవారం ధర్నా నిర్వహించారు. ధర్నాలో పాల్గొన్న కార్మికులు నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని, కాంట్రాక్టు ,ఔట్ సో ర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం రూ 35 వేలు ఇవ్వాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీ కరణను నిలిపివేయాలని,ఓల్డ్ పెన్షన్ స్కీం అమలు చెయ్యాలని,భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు ను పునరుద్దరించాలని, ఆటో, హమాలీ కార్మికులకు సంక్షే మ బోర్డు ఏర్పాటు చెయ్యాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమము లో బొచ్చా ముద్దుకృష్ణ, బం డారు రాంబాబు, బొచ్చా దుర్గాప్రసాద్, బంగారు శ్రీహరి, తురుగోపు నాగేశ్వరావు, బౌరిసెట్టి నాగేశ్వర రావు, కశింకోట వెంకటరమణ, బంగారు జగ్గమ్మ, కాకి లక్ష్మీదుర్గా,నిర్మల, జానకమ్మ తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

విశాలాంధ్ర - నిడదవోలు : తూర్పుగోదావరి జిల్లా చాగల్లు మండలం దార వరం గ్రామానికి చెందిన గాడి రాకేష్(17) కొవ్వూరు మండలం సీతంపేట పంచాయతీ పరిధిలో ప్రమాదవశాస్తు గోదావరిలో జారిపడి సోమ వారం మృతి చెందాడు. మరణించిన రాకేష్ కుటుం బాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఎం తూర్పుగోదావరి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జువ్వల రాంబాబు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. నిడదవోలు ప్రభుత్వఆసుపత్రి మార్చురీలో ఉన్న రాకేష్ మృతదేహాన్ని సందర్శించి ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. వర్షాకాలంలో వచ్చే వరద ఉధృతికి గోదావరి పాయల వద్ద భారీ లోతున గోతులు ఏర్పడుతున్నాయి. ఇటీవల కాలంలో గోదావరి పాయ ల గట్లు వద్ద తరచూ ప్రమాదాలు జరిగి చాలామంది మరణిస్తున్నారు. ప్రమాదాలు జరగకుండా ప్రభుత్వం, పోలీస్, రెవెన్యూ యంత్రాంగం పటిష్టమైన చర్యలు తీసుకొని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని రాంబాబు డిమాండ్ చేశారు.

స్టూడెంట్ కిట్లను పరిశీలించిన విద్యాశాఖాధికారి

విశాలాంధ్ర - మామిడికుదురు : మామిడికుదురు మండలంలోని లూటుకుర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠ శాలను కోనసీమ జిల్లా విద్యాశాఖ అధికారి షేక్ షలీమ్ భాష మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యా మిత్ర పథకం ద్వారా విద్యార్థులకు ప్రభుత్వం అందించనున్న విద్యా సామగ్రి కిట్లను ఆయన పరిశీలించారు. సంబంధిత అధికారులకు విద్యార్థులకు అందించాల్సిన విద్యాసామగ్రి పంపిణీ పై డిఇఓ సూచనలు చేశారు.సర్వేపల్లి రాధా కృష్ణన్ విద్యామిత్రలో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకి పాఠశాలలు పునః ప్రారంభం సమయానికి స్టూడెంట్స్ కిట్స్ అందజేస్తామని అన్నారు. ఈ కిట్స్‌లో విద్యార్థులకు స్కూల్ బ్యాగ్స్, షూస్, నోట్ బుక్స్, టెక్స్ట్ బుక్స్, బెల్ట్స్, యూనిఫామ్ మరియు డిక్షనరీలను అందజే స్తామని తెలిపారు. మామిడికుదురు మండలంలో 2025-26 విద్యా సంవత్సరంలో భాగంగా 3343 మంది విద్యార్థులకు ఇప్పటివరకు టెక్స్ట్ బుక్స్, బెల్ట్స్ వచ్చినట్లు మిగిలిన ఐటమ్స్ అన్ని రావలసియున్నదని తెలిపారు. వారితో పాటుగా మండల విద్యాశాఖధికారులు ఎస్‌వి లక్ష్మీనారాయణ, వెంకన్న బాబు, సీఆర్ఎంటీలు ఉన్నారు.

దర్శకుడు సుకుమార్‌ను కలిసిన ఎమ్మెల్యే దేవ

విశాలాంధ్ర - రాజోలు : మలికి పురం మండలం మట్టపర్రులో ప్రముఖ తెలుగు సినీ దర్శకుడు సుకుమార్‌ని అతని స్వగృహం నందు రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ మంగళవారం మర్యాపూర్వకంగా కలిశారు. సుకుమార్ కు పూల మొక్కను అందించి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఇద్దరి మధ్య రాజోలు నియోజకవర్గంలో పలు సమస్యలు వాటి పరిష్కార మార్గాలపై చర్చలు జరి గాయి. నియోజకవర్గ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని దర్శకుడు సుకుమార్ ఎమ్మెల్యే వరప్రసాద్‌కు చెప్పారు.

వకుళమాత అన్నప్రసాద భవన నిర్మాణానికి విరాళం

విశాలాంధ్ర - ఆత్రేయపురం : కోనసీమ తిరుమలగా ప్రసిద్ధిగాంచిన వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో భక్తులు స్వామివారి వసంత మండపం లో కళ్యాణం, అష్టోత్తర పూజలు అర్చకులు ఘనంగా నిర్వహించారు. చందన సరూపుడైన వెంకటేశ్వర స్వామి వారిని భక్తులు దర్శించుకుని అన్నప్రసాదాలు స్వీకరిం చారు. అనంతరం ఈ ఆలయ సన్నిధిలో నూతనంగా నిర్మిస్తున్న వకుళమాత అన్నప్రసాద భవన నిర్మాణానికి రావులపాలెం వాస్తవ్యులు కర్రీ వేంకట రెడ్డి కమలావతి దంపతులు, వారి కుటుంబ సభ్యులు రూ.1,01,116/-లు అందజేశారు. వీరికి ఆలయ అర్చకులు వేదమంత్రా లతో ఆశీర్వచనాలు అందించారు. ఆలయ డిప్యూటీ కమి షనర్ మరియు కార్యనిర్వాహణాధికారి నల్లం సూర్య చక్రధరరావు, పులపర్తి రాంబాబు స్వామివారి చిత్ర పటం, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ పులపర్తి రాం బాబు వర్మ, రాపాక శ్రీనివాస్, ఆలయ సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.

"ప్రమాదకరంగా మ్యాన్ హోల్"
విశాలాంధ్ర" వార్తకు స్పందించిన అధికారులు

విశాలాంధ్ర - కడియం : విశాలాంధ్ర పత్రికలో ఈరోజు "ప్రమాదకరంగా మ్యాన్ హోల్" శీర్షికన వచ్చిన వార్తకు అధికారులు వెంటనే స్పందించారు. ఒకపక్క వాన కురు స్తున్నప్పటికీ, సిబ్బందిని పంపి మ్యాన్ హోల్‌ను కవర్ చేస్తూ చర్యలు తీసుకున్నారు. అధికారులు తక్షణమే స్పందించడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జీవవైవిధ్య సంరక్షణా పురస్కారానికి సర్పంచ్ అన్నందేవుల చంటి ఎంపిక

విశాలాంధ్ర - కడియం : మండలం మాధవ రాయుడుపాలెం గ్రామ సర్పంచ్ అన్నందేవుల వీర వెంకట సత్యనారాయణ (చంటి) అంతర్జాతీయ జీవవైవిధ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అందించే జీవవైవిధ్య సంరక్షణా పురస్కా రానికి ఎంపికయ్యారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఈనెల 22 వ తేదీన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ చేతుల మీదుగా చంటి ఈ పురస్కారాన్ని అందుకుంటారు. చెట్లు సంరక్షణ, మూగజీవుల సంరక్షణ, సేంద్రియ వ్యవ సాయం, సంస్కృతులు, సంప్రదాయాలు, పర్యావరణ సంరక్షణ, తదితర అంశాలలో గత పాతికేళ్లుగా అన్నందేవుల చంటి చేస్తున్న కృషికి గాను ఆంధ్రప్రదేశ్ జీవవైవిధ్య మండలి ఆయనను ఈ అవార్డుకు ఎంపిక చేసింది. ఆంధ్రప్రదేశ్ జీవవైవిధ్య మండలి సభ్యుడు, సెక్రటరీ పి రామకృష్ణ అన్నందేవుల చంటికి ఎంపిక పత్రాన్ని పంపించారు.

డిజిటల్ అసిస్టెంట్లకు పదోన్నతి

విశాలాంధ్ర - అనపర్తి : మండలం లో వివిధ సచివాలయాల్లో డిజిటల్ అసిస్టెంట్లుగా విధులు నిర్వహిస్తున్న ఐదుగురికి పంచాయితీ సెక్రెటరీ గ్రేడ్ 5 గా పదోన్నత లభించింది. మంగళవారం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా డిపిఒ పదోన్నతి ఉత్తర్వులు జారీ చేశారు.దొర శ్రీనివాస్ (ఊలపల్లి 2), కర్రి రాజగోపాల్ రెడ్డి (తాపేశ్వరం 2), కర్రి అరవింద్ రెడ్డి (కొంకుదురు 2), కేశనకుర్తి రాజు (బిక్కవోలు 4), నల్లమిల్లి కోటిరెడ్డి (అనపర్తి 3) సచివాలయానికి పంచాయతీ కార్యదర్శి గ్రేడ్ 5 గా పదోన్నతి పొందారు. పదోన్నతి పొందిన కార్యదర్శుల బృందం ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డిని, మండల అభివృద్ధి అధికారి మండ రామకృష్ణారెడ్డిని మర్యాదపూర్వకంగా కలవగా పదోన్నతి పొందిన కార్యదర్శులను అభినందించారు.

మినీ మహానాడుకు తరలివెళ్లిన టీడీపీ శ్రేణులు

విశాలాంధ్ర - నిడదవోలు : రాష్ట్రముఖ్యమంత్రి,టిడిపి అధినేత నారాచంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు నిడదవోలు మాజీ శాసన సభ్యులు, టీడీపీ ఇన్‌ఛార్జ్ బూరుగుపల్లి శేషారావు అధ్యక్షతన నిడదవోలు నియోజకవర్గం ఉండ్రాజవరం మండలం వేలివెన్ను గ్రామంలో రైతు సంఘం భవనం నందు మంగళవారం నిర్వహించిన నిడదవోలు నియోజకవర్గ మినీ మహానాడుకు నిడదవోలు పట్టణ నుండి భారీ ఎత్తున నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ర్యాలీగా తరలివెళ్లారు. వేలివెన్ను లో జరిగిన మినీ మహానాడు సభకు బయలుదేరి వెళ్తున్న టిడిపి శ్రేణులకు పట్టణ టీడీపీ అధ్యక్షులు కొమ్మిన వెంకటేశ్వరరావు జెండా ఊపి ర్యాలీ యాత్రను ప్రారంభించారు.

పలుచోట్ల ఓల్టేజ్ సమస్యతో ప్రజల ఇక్కట్లు

విశాలాంధ్ర - సీతానగరం: మండలంలో పలు గ్రామాల్లో పలు చోట్లలో ఓల్టేజ్ సమస్యతో ప్రజలు ఇక్కట్లు. రఘుదేవపురం బోసు బొమ్మ చుట్టు పక్కల, సీతానగరం శివాలయం కాలనీలో ఓల్టేజ్ సమస్యలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రఘుదేవపురం బోసు బొమ్మ చుట్టు పక్కల స్థానికులు కొన్ని రోజుల క్రితం లో ఓల్టేజ్ సమస్యతో రోడ్డు పై బయటయించి తమ నిరసన వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. అయితే ఈ నిరసన అనంతరం విద్యుత్ అధికారులు హుటా హుటిన దాబా ట్రాన్స్ఫర్మర్ ఏర్పాటు చేసి చేతులు దులుపుకున్నారు అని వాపోతున్నారు. ఈ ట్రాన్స్ఫర్మర్ ఏర్పాటు చేసిన ఒక్క రోజు మాత్రమే లో ఓల్టేజ్ సమస్య తీరింది అని ఆనాటి నుంచి నేటి వరకూ పగటి పూట 190-95 వోల్ట్స్ అదే రాత్రులు 160-170 వోల్ట్స్ విద్యుత్ సరఫరా వస్తుందని దీనివలన గృహంలో ఉన్నటీవీ, ఫ్యాన్ పరికరాలు పడిపోతున్నాయి అని ఆవేదన వ్యక్తం చేశారు. రాత్రు లు అయితే కనీసం సీలింగ్ ఫ్యాన్ కూడా తిరగక పోవడం వలన పిల్లలు, మహిళలు, వృదులు నిద్రలేని రాత్రులు గడపాల్సి వస్తుందని వాపోయారు. దీనిపై సంబంధిత అధికారులు స్పందించి ఓల్టేజ్ సమస్య శాశ్వత పరిష్కారం అయేవిధంగా చర్యలు తీసుకోవాలని లేని యడల మళ్ళీ రోడ్డు పై బయటాయించి నిరసన వ్యక్తం చేస్తామని అన్నారు.

ఉపాధి హామీ పథకం పనుల పరిశీలన

విశాలాంధ్ర- దేవరపల్లి : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా దేవరపల్లి మండలం కృష్ణ పాలెం గ్రామపంచాయతీలో ఉపాధి హామీ పథంలో తనకి నిమిత్తం పని ప్రదేశంలో పని కొలతలు, మాస్టర్లువ ఎంపీడీవో ఎస్ వేణుగోపాల్ రెడ్డి, ఉపాధి హామీ ఏపీఓ శ్రీనివాసు పనులు పరిశీలించారు. దీనిలో భాగంగా ఎంపీడీవో వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ ఇన్సూరెన్స్ ప్రాముఖ్యత గురించి, అదే విధంగా పని ప్రదేశంలో ఉండవలసిన మంచినీటి సదుపాయాలు ఓఆర్ఎస్ ప్యాకెట్ల గురించి పని కొలతల గురించి క్లుప్తంగా మేట్ చేత ఫీల్డ్ అసిస్టెంట్ చేత ఉపాధి హామీ పథకంలో కూలీలందరికీ అవగాహన కల్పించారు. ఈ 15 గ్రామపంచాయతీలో ప్రస్తుతం చేయదగిన పనులు ఫీల్ చానల్స్ ఫెడరల్ చానెల్స్ చెరువులు చెట్లుకి కందకాల తీయటం ఫారం పండ్లు నిర్మాణ ము సోపిట్లు కంపోస్టులు ప్రతి ఒక్కదాని గురించి వివరణ ఎంపీడీవో ఏపీవో తెలియజేశారు.

వేటకు వెళ్లిన మత్స్యకార యువకుడు గల్లంతు

విశాలాంధ్ర - యు కొత్తపల్లి : వేటకు వెళ్లిన మత్స్యకార యువకులు బోటు బోల్తా కొట్టడంతో ఒకరు గల్లంతవ్వగా మరో ఇద్దరు సురక్షితంగా చేరుకున్న సంఘటన చోటు చేసుకుంది. అధి కారులు తెలిపిన వివరాల ప్రకారం సముద్ర తీరంలో వేట నిషేధం ఆంక్షలు ఉన్నప్పటికీ ఉప్పాడ నాయకర్ కాలనీకి చెందిన ముగ్గురు మత్స్యకార యువకులు మెరుగు శ్యామ్, వంక ఇసాక్, రామిశెట్టి వీరబాబు సోమవారం అర్ధరాత్రి బోటు పై వేటకి వెళ్ళగా సముద్రపు అలలు తీవ్రంగా ఉండడంతో హోప్ ఐలాండ్ సమీపము వద్ద బోటు బోల్తా కొట్టి సముద్రంలో యువకులు పడిపోవడంతో ఇద్దరు మత్స్యకారులు ఈదుకుంటూ హోప్ ఐలాండ్ చేరుకోగా మరో మత్స్యకార యువకుడు మెరుగు శ్యామ్‌కి ఈత రాకపోవ డంతో గల్లంతయ్యాడు సమాచారం తెలుసుకున్న అధికారులు గల్లంతయిన శ్యామ్ కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు మత్స్యశాఖ అధికారులు తెలిపారు. వేట నిషేధ సమయంలో వేటకు వెళ్లడం నేరమని మత్స్యశాఖ అధికారులు చెబుతున్నారు.

ఉషా చాంపియన్ షిప్‌లో లోవరాజుకు బంగారు పథకం

విశాలాంధ్ర - కరప : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఈనెల 12, 14 తేదీల్లో కర్నూలు జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి ఉషా చాంపియన్షిప్ సీనియర్ టోర్నమెంట్లో కాకినాడ జిల్లా కరప మండలం జి బావవరం గ్రామానికి చెందిన యు లోవరాజు 80 కిలోల విభాగంలో బంగారు పతకం సాధించడం జరిగింది. అలాగే జాతీయ స్థాయిలో జరుగుపోటీలకు అర్హత సాధించాడని జిల్లా ఉషా సెక్రటరీ ఆర్ సుందరం తెలిపారు. గెలిపొందిన లోవరాజును కాకినాడ జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి, జిల్లా స్పోర్ట్స్ డెవలప్ మెంట్ అధికారి బి శ్రీనివాస కుమార్, ఉషా సెక్రటరీ బి నరసింహారావు, పి శ్రీనివాసరావు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

టిడిపి మండల అధ్యక్షుడిగా సత్తిబాబు

విశాలాంధ్ర - ఆలమూరు : కొత్తపేట నియోజకవర్గం ఆలమూరు మండల తెలుగు దేశం పార్టీ అధ్యక్షులుగా అమలాపురం పార్ల మెంటు తెలుగు రైతు అధికార ప్రతినిధిగా ఈదల సత్తిబాబును నియ మించారు. తెలుగుదేశం పార్టీకి సుదీ ర్ఘకాలంగా పనిచేస్తున్నారు. ముఖ్యంగా ఎమ్మెల్యే బండారు సత్యానందరావుకు నమ్మకస్తుడుగా ఉంటారు. అలాగే లంక గ్రామాలకు పార్టీ ఇన్చార్జిగా ఉంటూ అనేక పార్టీ సమస్య లను చాకచక్యంగా పరిష్కరిస్తూ వస్తున్నారు. వివాదర హితుడిగా ఉంటూ అన్ని వర్గాల వారిని కలుపుకొని పోవడం లో సత్తిబాబు దిట్ట. అందుకనే ఆయనకు కీలకమైన ఈ పదవిని అప్పగించారు. ఇప్పటివరకు మండల టిడిపి అధ్యక్షులుగా ఉన్న మెర్ల గోపాల స్వామి ఇటీవల జరిగిన నీటి సంఘాల ఎన్నికల్లో డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ పదవిని చేపట్టారు. ఈ నేపథ్యంలో ఆలమూరుకు చెందిన సత్తిబాబుకు అవకాశం కల్పించారు. ఈ సందర్భంగా సత్తిబాబు మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి నిరంతరం పని చేస్తానన్నారు. తనకు ఈ పదవి రావడానికి కారకులైన ఎమ్మెల్యే సత్యానందరావుకు ఇతర నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆద్యంతం ఆధ్యాత్మికం

- కన్నుల పండువగా ధన్వంతరి ఆలయ ప్రతిష్ఠాపన, శ్రీనివాసుని కళ్యాణ వేడుకలు
- మార్మోగిన గోవింద నామస్మరణ
- జీఎస్ఎల్ తరలివచ్చిన భక్తజనం

విశాలాంధ్ర - రాజానగరం : ప్రపంచాన్ని భక్తి మార్గం వైపు నడిపేందుకు,లోకహితం కోరి తూర్పు గోదావరి జిల్లా రాజానగరం మండలంలోని జీఎస్ఎల్ వైద్య కళాశాల, జనరల్ హాస్పటల్ ప్రాంగణంలో ఆ విద్యా సం స్థల అధినేత డాక్టర్ గన్ని భాస్కరరావు, డాక్టర్ గన్ని కాశింబి దంపతుల ఆధ్వర్యంలో టీటీడీ ఆస్థాన వేద పండితులు బ్రహ్మ శ్రీ రావిపాటి వేంకట ప్రసాద్ అధ్యక్షత వహించగా టీటీడీ పండితులు పెద్దింటి లక్ష్మీనారాయణ, గోపాలచర్యులు, సాయి, వెంకట్, ప్రకాష్, కృష్ణ సాయి, ఆగమ పండితుల నిర్వహణలో నాలుగు రోజులుగా జరిగిన వివిధ ఆధ్యాత్మిక మహోత్సవ వేడుకలు ఘనంగా ముగిశాయి. దీనిలో భాగంగా శ్రీ ధన్వం తరి ఆలయ ప్రతిష్ఠాపన మహోత్సవం,మహా కుంభాభిషేకం కార్యక్రమాలు అంగరంగా వైభవంగా నిర్వహించారు. ఈ నెల 16వ తేదీన అంకురార్పణ,17వ తేదీన ఆదివాసా పూజలు, కుంభరాధన,విశేష హోమాలు,18వ తేదీన బింభ స్థాపన,మహా శాంతిభిషేకం,19వ తేదీన మహా పూర్ణాహుతి,స్వామివారి విగ్రహప్రతిష్ఠ,మహా కుంభాభిషేకం వంటి దైవ కార్యక్రమాలు త్రయాహ్నిక దీక్షతో వైఖానస ఆగమ శాస్త్ర విధానోక్తంగా టీటీడీ నుండి విచ్చేసిన వేద పండితులు భక్తి శ్రద్ధలతో జరిపించారు. తొలుత చెక్కతో తయారు చేసిన చరకతో అగ్నిదేవున్ని ఆహ్వానిస్తూ చేసిన అగ్ని హోమం క్రతువులో భక్తి పారవశ్యం అడుగడుగునా కనిపించింది.అగ్ని జ్వలించిన సందర్భంగా భక్తులంతా చేతులు జోడించి గోవింద నామస్మరణ చేశారు.అలాగే 19వ తేదీ రాత్రి వేళ జరిగిన శ్రీ శ్రీదేవి శ్రీ భూదేవి సమేత శ్రీ శ్రీనివాస కళ్యాణ మహోత్సవం,స్వామి వారి పుష్ప యాగం వేడుకలను అన్నమాచార్య సంకీర్తన మరియు మంగళవాయిద్యాలు నడుమ స్వామి వారి కళ్యాణం నేత్రపర్వంగా జరిగింది. ఈ సందర్భంగా తిరుమలలో నిత్యం జరిగే కళ్యాణ విశేషాలను స్థానిక భక్తులకు బ్రాహ్మ శ్రీ రావిపాటి వేంకట ప్రసాద్ వ్యాకరణతో కంటికి కట్టినట్టుగా వివరించారు.కళ్యాణ పీటలపై జీఎస్ఎల్ క్యాన్సర్ హాస్పిటల్ డైరెక్టర్ సర్జికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ గోగినేని తరుణ్,జీఎస్ఎల్ సంస్థలు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ గన్ని సాధిక దంపతులు, జీఎస్ఎల్ దంత కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గంటా సునీల్, డాక్టర్ బాను సంధ్య దంపతులు, ప్రముఖ న్యూరాలజిస్ట్ వైద్యులు డాక్టర్ ఎం.ఫణి కుమార్, డాక్టర్ ప్రగతి దంపతులు, ప్రముఖులు కంటమణి కాశి విశ్వనాథ్ దంపతులు, బొర్లపూడి రవీంద్ర కుమార్ దంపతులు,బొప్పన బ్రహ్మజీ దంపతులు కళ్యాణ తంతు భక్తిశ్రద్ధతో నిర్వహించారు. వేడుకల్లో భాగంగా ప్రత్యేక అవసరాలు కలిగిన వ్యక్తులు,వృద్ధులకు ప్రత్యేక ఏర్పాట్లు నిర్వహించారు. అనంతరం స్వామి వారి తీర్థ ప్రసాదాలు భక్తులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జీఎస్ఎల్ విద్యాసంస్థలలోని వివిధ శాఖల అధిపతులు, పలువురు ప్రముఖులు, మహిళలు పాల్గొన్నారు.

ఘనంగా జూనియర్ ఎన్టీఆర్ పుట్టినరోజు వేడుకలు

విశాలాంధ్ర - యానాం : యానాం శివారు సావిత్రి నగర్ మిని ఇండోర్ స్టేడియంలో ప్రముఖ సినీ హీరో జూనియర్ ఎన్టీఆర్(నందమూరి తారక రామారావు)పుట్టినరోజు వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. యానాం సావిత్రి నగర్ నందమూరి అభిమాన సంఘం ఆధ్వర్యంలో జరిగిన జూనియర్ ఎన్టీఆర్ పుట్టినరోజు వేడుకలలో పరిసర ప్రాంతాలకు చెందిన నందమూరి అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. పరిసర ప్రాంతాలకు చెందిన నందమూరి అభిమానులు రక్తదాన శిబిరంలో పాల్గొని రక్త దానం చేశారు. కాకినాడ శ్రీ యువసేన బ్లడ్ బ్యాంక్ బృందం రక్తదాతల నుండి రక్తాన్ని సేకరించారు. అదేవిధంగా భారీ కేక్ కటింగ్ నిర్వహించి మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సావిత్రి నగర్ నందమూరి అభిమాన సంఘం ప్రెసిడెంట్ మస కపల్లి వెంకటేశ్వరరావు, (బుజ్జి) ఉపాధ్యక్షుడు సంగాడి సతీష్, కార్యదర్శి పెసిం గి బాబి, సంయుక్త కార్యదర్శి దండుప్రోలు భావన్నారాయణ, కోశాధికారి వన వాడి మాతరాజు, కాలాడి నారాయణ, కొప్పాడి బంగారయ్య, దోమ వీర రాజు, భారతరాజు, పరిసర ప్రాంతాల నందమూరి అభిమానులు పాల్గొన్నారు.

ఉద్యమ ఫలితమే ఎస్సీ వర్గీకరణ

విశాలాంధ్ర - కొవ్వూరు : సమాజంలో ఎన్ని అవమానాలు ఎదురైనప్పటికీ పార్టీ పట్ల అంకితభావంతో పనిచేస్తూ, అధినాయకుడి ఆదేశాలను అనుసరిస్తూ, మాదిగ జాతి ఔన్నత్యానికి నిరంతరం శ్రమించిన కె ఎస్ జవహర్‌కు ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పదవి దక్కడం మాదిగ జాతికి దక్కిన గౌరవంగా భావిస్తున్నామని ఎంఆర్పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్గా బాధ్య తలు చేపట్టిన కె ఎస్ జవహర్ ను మందకృష్ణ మాదిగ సోమవారం కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మందకృష్ణ మాదిగ మాట్లాడుతూ దళితులలో 59 కులాలు ఉన్నప్పటికీ ఒకటి అవకాశం దక్కించుకున్న కులమైతే రెండోది అవకాశం దక్కని కులం ఒక్క మాదిగ కులమని అన్నారు. ఎస్సీ కార్పొరేషన్ ఏర్పడిన నాటినుండి ఒకే కులానికి చెందినవారు మాత్రమే చైర్మన్ పదవులను స్వీకరించారని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆశీస్సులతో మాదిగ జాతి పట్ల ఔన్నత్యాన్ని చాటుతూ పార్టీ పట్ల విధేయుడుగా పనిచేసిన మాజీ మంత్రి కె ఎస్ జవహర్ కు ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పదవి దక్కడం మాదిగ జాతికి దక్కిన మొట్టమొదటి గౌరవం అని అన్నారు. తెలుగుదేశం పార్టీ విజయంలో మాదిగల కృషి ఉందని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గుర్తించారని అన్నారు. మాదిగలు తెలుగుదేశం పార్టీ వెన్నంటే ఉంటారని అన్నారు.

ఈ సందర్భంగా ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ జవహర్ మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ ఉద్యమ ఫలితమే నేడు ఎస్సీ వర్గీకరణ కు ప్రభుత్వం ఆమోదం తెలపడం అని అన్నారు, మందకృష్ణ నేతృత్వంలోనే ఆనాడు తెలుగుదేశం పార్టీ ప్రభుత్వంలో చర్మకారులకు చెప్పులు కుట్టే వాళ్లకు పెన్షన్ అందించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయ కులు ముమ్మిడివరపు సుబ్బారావు, బయ్యవరపు రాజేష్ కాకర నూకరాజు గడ్డం వినోద్ కొత్తపల్లి మురళి తాతపూడి సురేష్ గాలింపు రాము కోడి సూరి, తెలుగుదేశం తూర్పుగోదావరి జిల్లా అధికార ప్రతినిధి బూరుగుపల్లి రాఘవులు, తెలుగు రైతు రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి పసలపూడి సుభాష్ చంద్రబోస్, మాజీ ఏఎంసీ చైర్మన్ వేగి చిన్న, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు దున్న దుర్గారావు, తదితర ఎమ్మార్పీఎస్ నాయకులు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

మీసాల వెంకన్న ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులతో

మల్లాడి సమీక్షా సమావేశం

విశాలాంధ్ర - యానాం : యానాంలో ప్రసిద్ధి చెందిన శ్రీ భూసమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయ పునర్నిర్మాణానికి సంబంధించి రెండవ దఫా నిర్మాణ పనులకు నిధులు కేటాయించాలని తిరుమల తిరుపతి దేవస్థానంను పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు కోరిన మేరకు మంగళవారం జరిగిన బోర్డు మీటింగ్లో ఒక కోటి 90 లక్షల రూపాయలు నిధులను ఇచ్చేందుకు దేవస్థానం బోర్డు అంగీకారం తెలిపిందని పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు తెలిపారు. యానం శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో నిర్మాణ కమిటీ ప్రతినిధులతో కలిసి ఆయన మంగళవారం మీడి యా సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా మల్లాడి మాట్లాడారు. మొదటి దశ లో తిరుమల తిరుపతి దేవ స్థానం శ్రీవాణి ట్రస్ట్ నుంచి మూడు కోట్ల రూపాయలు ఇవ్వడం జరి గింది. అప్పటికే యానాం వెంకటేశ్వర స్వామి ఆల యం నిర్మాణ కమిటీ ఫౌండేషన్ నిమిత్తం కోటి 30 లక్షల రూపాయలు వెచ్చిం చడంతోపాటు మరో రెండు కోట్ల 70 లక్షల రూపాయలు తిరుమల తిరుపతి దేవస్థానానికి మొదటి దశలో ఏడు కోట్ల రూపాయల పనులు చేపట్టడం జరిగింది. రెండో దశలో 9 కోట్లతో ప్రతిపాదన సిద్ధం చేయగా తిరుమల తిరుపతి దేవస్థానం రెండో దశ కోటి 90 లక్షలు కేటాయించడంతో మిగిలిన ఏడు కోట్ల రూపాయలు దాతల సహకారం పుదుచ్చేరి ప్రభుత్వ సహకారంతో ఏర్పాట్లు చేయడం జరుగుతుంద న్నారు. ఈ సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థానం ఈవోకి బోర్డు మెంబర్లకు ప్రత్యేకంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి యానాం ప్రజల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

ఘనంగా ముగిసిన నంగవరం మల్లమ్మ జాతర ఉత్సవాలు

విశాలాంధ్ర - అమలాపురం : డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఉప్పలగుప్తం మండలం నంగవరం గ్రామ దేవత శ్రీ మల్లమ్మ తల్లి అమ్మవారి తీర్థం ఘనంగా జరిగిందని 13 తేదీ నుండి 20 వరకు వారం రోజులు పాటు 20వ తేదీ తీర్థం రోజు ఉదయం నుంచి భక్తులు కోళ్ళు, మేక పోతులతో మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం 11 గంటల నుండి గుడి వద్ద అభిరుచి స్వీట్స్ కాకినాడ వారు మందపల్లి పల్లమరాజు గనికమ్మ దంపతులచే భారీ అన్న సమారాధన జరిపించినారు. ఈ అన్న సమారాధనలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారి యొక్క తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. గ్రామంలో ఆడ పడుచులు చీరలు, గాజులతో మొక్కలు తీర్చుకున్నారు. మాజీ జెడ్పిటిసి దేశంశెట్టి లక్ష్మీనారాయణ, ఉప్పలగుప్తం ఎస్సై రాజేష్ తది తరులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్ర మం ఇంత వైభవంగా జరగడానికి కారణమైన కమిటీ కుర్రాళ్ళకు అభినందనలు తెలియజేసారు. కమిటీ చైర్మన్ గుర్లింక చిన్నా, గుర్లింక వెంకన్న బాబు, మందపల్లి వీరబాబు, గుర్లింక బుల్లిరాజా, గుర్లింక వీరన్న, కామిరెడ్డి నారాయణ రావు, దొడ్డి పట్ల దుర్గారావు, దొడ్డిపట్ల వీరసాయి, కామిశెట్టి యోగి, కామిరెడ్డి రాంబాబు, నార్ని ఈశ్వర్రావు, కామిరెడ్డి నాగేశ్వరావు, గునుబోలు శ్రీను, సలాది సాయిరాం, కామిరెడ్డి నాగేశ్వర్రావు గుర్లింక ఏసు రాజు జిన్నూరి మోహన్, పోలిశెట్టి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

స్వామికి ఘనంగా పంచామృతాభిషేకం

విశాలాంధ్ర - జంగారెడ్డిగూడెం రూరల్: మండలం లోని గురవాయి గూడెం గ్రామంలో వేంచేసిన అయ్యప్ప స్వామి వారి దేవ స్థానంలో ఉపాలయమైన సుబ్రహ్మ ణ్యేశ్వర స్వామికి ఆలయ అర్చకులు మంగళ వారం పంచామృతాభిషేకం ఘనంగా నిర్వహిం చారు. దేవస్థానానికి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శించుకు న్నారు. వచ్చిన భక్తులకు ఆలయ అధికారులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

యార్లగడ్డ ముసలయ్య మృతి

విశాలాంధ్ర - ఆత్రేయపురం : మండలం కేంద్రంలో పేరవరం గ్రామా నికి చెందిన యార్లగడ్డ ముసలయ్య తండ్రి పేరు వీరయ్య వయసు 78 సంవత్సరాలు అను ఆసామి తన ఇంట్లో వంట చేసుకుంటూ ఉండగా ఉన్నటు వంటి గ్యాస్ పొయ్యి నుండి మంటలు వచ్చి శరీరం కాలిపోయి గాయాలైనట్లు అంతట అతని కుమారుడైన యార్లగడ్డ వీర రాజు రాజ మండ్రి గవర్నమెంట్ హాస్పిటల్ వైద్యం చేయిస్తున్నాడు. వైద్యం పొందుతూ సోమ వారం రోజు సాయంత్రం 6 గంట లకు యార్లగడ్డ ముసలయ్య చనిపో యాడు. సదరు విషయంపై ఆత్రేయపురం ఎస్ఐ నమోదు చేశారు.

వరద సమస్యను పరిష్కరిద్దాం

విశాలాంధ్ర - విస్సన్నపేట టౌన్ : వర్షం కురిసిన ప్రతిసారీ విస్సన్నపేట ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణం నీట మునగటం, రోజుల తరబడి నీరు నిలిచి, మురికి కూపంగా మారటం జరు గుతోంది. తాజాగా సైతం ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే మార్గ మంతా నీట మునిగి ఉండగా, అధికారులు సెప్టిక్‌ట్యాంకు క్లీనర్ల సాయంతో నీటిని బయటకు తరలించారు. విస్సన్నపేటలో రెవెన్యూ, మండలపరిషత్తు, విద్యాశాఖ, వెలుగు, నరేగా, గృహ నిర్మాణం, 108, ఇంజనీరింగ్ విభాగం కార్యాలయాలన్ని ఒకే ప్రాంగణంలో ఉన్నాయి. మురుగుకాలువల నిర్వహణ దెబ్బ తినటంతో వర్షం కురిసిన ప్రతి సందర్భంలోనూ ఈ ప్రాంగణం వర్షపు నీటితో మునగటం, నీరు బయటకు వెళ్లే మార్గం లేక మురుగు కూపంగా మారి, రాకపోకలు సాగించేందుకు అధికా రులు, ప్రజలు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. ఈ విషయమై తాజాగా అధికారులు దృష్టి సారించారు.

స్వయం సహాయక సంఘాల సభ్యులు ఆర్థికంగా ఎదగాలి

విశాలాంధ్ర - నరసాపురం : స్వయం సహాయక సంఘాల మహిళలు స్వశక్తితో ఆర్థికంగా ఎదగాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. మంగళ వారం నరసాపురం మండలంలోని పలు గ్రామాలలో స్వయం సహాయక గ్రూపులు నిర్వహిస్తున్న యూనిట్లను జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆకస్మికంగా సందర్శించి పరిశీ లించారు. ఈ సందర్భంగా లక్ష్మ ణ్వేశ్వరం గ్రామంలో పిండి వం టలు స్వీట్లు తయారు చేసి యూనిట్, సార్వ గ్రామంలో మినీ డైరీ యూనిట్, తూర్పు తాళ్లలో ఫ్లోర్ మిల్లు పచ్చళ్ళు తయారు చేసే యూనిట్, చామ కూరి పాలెంలో డొక్క తాడు పరిశ్ర మను జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి క్షేత్రస్థాయిలో పరిశీ లించి, యూనిట్ నడిపే వారి సభ్యులతో మాట్లా డారు. కుటుంబ పరిస్థితులను అడిగి తెలుసుకు న్నారు. మీ పిల్లలు ఏమి చదువుతున్నారు,ఏమి పను లు చేస్తారని ఆరా తీశారు. మీరు తయారు ఐటమ్స్, మార్కెట్ ఏ విధముగా ఉంది అని అడిగి తెలుసుకు న్నారు. ఈ సందర్భంగా యూనిట్ సభ్యులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లా డుతూ స్వయం సహాయక సంఘాల మహిళలు స్వశక్తితో ఆర్థికంగా ఎదగాలని అన్నారు. స్వశక్తితో నిలబడేందుకు బ్యాంకు రుణాలు బ్యాంకు లింకేజీ సి ఐ ఎఫ్,స్త్రీ నిధి,పీఎం ఈజీ ఏపీ,తదితర ప్రభుత్వ బ్యాంకు రుణాలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ అన్నారు. కలెక్టర్ వెంట ఆర్డిఓ దాసిరాజు,డి ఆర్ డి ఏ పిడి ఎంఎస్ఎస్ వేణుగోపాల్, మున్సిపల్ కమిషనర్ అంజయ్య, తాహసిల్దార్ అయితం సత్య నారాయణ, ఏపిఎం నాగభూషణం నాయుడు, సీసీలు,సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఈవీఎంల భద్రతకు చర్యలు
- కలెక్టర్ షణ్మోహన్

విశాలాంధ్ర - కాకినాడ : ఈవీఎం, వీవీపాట్స్ (ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్) భద్రతకు అవసరమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కాకినాడ కలెక్టర్ కార్యాలయం వద్దనున్న ఈవీఎం గోదామును జిల్లా కలెక్టర్ షణ్మోహన్, రెవిన్యూ, ఎన్నికలు అగ్నిమాపక, పోలీస్ శాఖల అధికారులతో కలిసి తనిఖీ చేశారు. ఈవీఎం గోదాము భద్రతకు చేపడుతున్న చర్యలను జిల్లా కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈవీఎం, వీవీపాట్స్ భద్రతకు చర్యలు చేపట్టాలని రెవెన్యూ, ఎన్నికల శాఖల అధికారులను ఆదేశించారు. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి నెల ఈవీఎం గోదాము భద్రతను తనిఖీ చేసి, నివేదిక పంపిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ వెల్లడించారు. ఈ పరిశీలనలో జిల్లా కలెక్టర్ వెంట కాకినాడ అర్బన్ తహసీల్దార్ వీ జితేంద్ర, కలెక్టరేట్ ఎన్నికల విభాగం డీటీ ఎం జగన్నాథం ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

టిడిపి మండల ప్రధాన కార్యదర్శిగా సలాది

విశాలాంధ్ర - ఆలమూరు : కొత్తపేట నియోజక వర్గంలోని ఆలమూరు మండల తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శిగా పెదపళ్ల గ్రామానికి చెందిన సలాది నాగేశ్వరరావును ఎంపిక చేశారు. ఈ మేరకు సోమవారం కొత్తపేటలో జరిగిన తెలుగుదేశం పార్టీ మినీ మహానాడు కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు కార్యక కార్యకర్తల హర్షధ్వానాలు మధ్య ప్రకటించారు. ఈయన తెలుగుదేశం పార్టీ కోసం నిరంతరం కృషి చేస్తూ వస్తున్నారు. ముఖ్యంగా ఎమ్మెల్యే బండారుకు వీర విధేయుడుగా గుర్తింపు పొందారు. అందుకనే సలాదికి ఈ బాధ్యతలు అప్పగించారు. ప్రస్తుతం ఆయన పదవిని చేపడుతున్నారు. ఈ సందర్భంగా సలాది మాట్లాడుతూ తనకు ఈ బాధ్యతలు అప్పగించిన ఎమ్మెల్యే బండారుకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభివృద్ధికి నిరంతరం పని చేస్తానని పార్టీ క్యాడర్‌కు హామీ ఇచ్చారు.

ఎన్టీఆర్ పుట్టినరోజు వేడుకలు

విశాలాంధ్ర - అమలాపురం : డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోన సీమ జిల్లా అమలాపురం పట్టణంలో వెంకటరమణ థియేటర్ వద్ద కోనసీమ జిల్లా జూనియర్ ఎన్టీఆర్ అభిమానుల సంఘ అధ్యక్షుడు రాయుడు బాబ్జి ఆధ్వర్యంలో భారీ వర్షాన్ని సైతం లెక్కచేయకుండా వర్షంలో తడుస్తూ. ఎన్టీఆర్ అభిమానులు కేకులు కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు పరస్పరం తెలుపుకున్నారు. స్వీట్లు, మిఠాయిలు పంచుకుంటూ ఒకరికి ఒకరు తినిపించుకుంటూ జై జూనియర్ ఎన్టీఆర్ అంటూ కేరింతలు కొట్టారు. వెంకటరమణ థియేటర్ నిండా జూనియర్ ఎన్టీఆర్ ఫోటోలు, ఫ్లెక్సు రంగురంగుల పోస్టర్లతో అలంకరించారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున బాణాసంచా కాల్చి యువకులు సందడి చేశారు. జూనియర్ ఎన్టీఆర్ అభిమాన సంఘాలు కేకులు కట్ చేసి అభిమాన నటుడు జూనియర్ ఎన్టీఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

ప్రభుత్వ వసతి గృహాలలో పూర్తి సదుపాయాలు కల్పించాలి
కలెక్టర్ చదలవాడ నాగరాణి

విశాలాంధ్ర - నరసాపురం : ప్రభుత్వ వసతి గృహాల మరమ్మత్తు పనులను సత్వరమే పూర్తి చేసి విద్యార్థిని, విద్యార్థులకు సౌకర్యవంతంగా ఉండే విధంగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పేర్కొన్నారు. మంగళవారం నరసాపురం పట్టణంలో ఎన్టీఆర్ కాలనీలో సాంఘిక సంక్షేమ బాలికలు,బీసీ సంక్షేమ బాలికల వసతి గృహాలు, చలవపేట బాలుర వసతి గృహాన్ని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆకస్మికగా తనిఖీ చేశారు. జరుగుచున్న మరమ్మత్తు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వసతి గృహాలలో ఉంటున్న విద్యార్థిని, విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయాలన్నారు. వసతి గృహాల మరమ్మత్తు పనులతో పాటు త్రాగునీరు, టాయిలెట్స్, మరియు డ్రైనేజీ సదుపాయాలు గురించి ఆరా తీశారు.ఈ సందర్భంగా గృహ నిర్మాణ శాఖ అధికారి జి.పిచ్చయ్య అక్కడ జరుగుచున్న పనుల ప్రగతి గురించి జిల్లా లెక్టరుకు వివరించారు. వసతి గృహాల మరమ్మత్తు పనులకు సంబంధించి రూ.18 లక్షలు మంజూరు అయ్యాయని, ఇప్పటివరకు రూ.10 లక్షలు ఖర్చు చేసి స్లాబ్ లీకేజీలు, టాయి లెట్స్, డ్రైనేజీ మరమ్మత్తు పనులు చేపట్టామని ప్రస్తుతం పనులు కొనసాగుతున్నాయని, మిగతా పనులు త్వరలో పూర్తి చేస్తామని కలెక్టర్‌కు వివరిం చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మిగిలిన పనులు కూడా సత్వరమే పూర్తి చేయాలని సంబంధిత అధి కారులను ఆదేశించారు.ఈ సందర్భంలో ఆర్డిఓ దాసిరాజు, జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారి జి.పిచ్చయ్య, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి బి.రామాంజనేయ రాజు, అసిస్టెంట్ బిసి వెల్ఫేర్ ఆఫీసర్ వెంకటేశ్వర రావు, తహసిల్దార్ అయితం సత్యనారాయణ, హాస్టల్ వార్డెన్లు ఉన్నారు.

ఉపాధి కూలీల ఆటోను ఢీకొట్టిన బస్సు
14మందికి గాయాలు

విశాలాంధ్ర - భీమడోలు : భీమడోలు వద్ద మంగళవారం ఉదయం పెనుప్రమాదం తృటిలో తప్పింది. భీమడోలు గ్రామం నుంచి ఆటోలో ప్రయాణిస్తున్న ఉపాధిహామీ కార్మికులను(కూలీలను) తరలిస్తున్న ఆటోను భీమడోలు శివారు అయ్యప్పస్వామి ఆలయం వద్ద హైవే పై వెనుక నుంచి ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఆటోను ఢీకొట్టింది. ప్రమాదానికి గురైన ఆటో మరొక ఆటోను ఢీకొట్టి రహదారి పక్కనున్న చెట్టును ఢీకొని ఆగింది. ప్రమాదంలో 14 మంది ఉపాధి కార్మికులకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఏలూరు, భీమడోలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. భీమడోలు సిఐ విల్సన్, ఎస్ఐ సుధాకర్ ఘటనా స్థలిని పరిశీలించారు. భీమడోలు తహసీల్దార్ రమాదేవి, ఎంపీడీఓ పద్మావతి దేవి అధికారులు ఆస్పత్రిలో క్షతగాత్రులను పరామర్శించారు.

పెదమల్లాపురాన్ని గిరిజన మండలంగా ప్రకటించాలి

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : శంకవరం మండలం పెదమల్లాపురంనీ గిరిజన మండలంగా ప్రకటించాలని రాష్ట్ర ఎస్టీసెల్ చైర్మన్ గొల్లి బాజిరెడ్డిని కాకినాడ జిల్లా బిజెపి నేతలు చిలుకూరి రామ్ కుమార్, ఉమ్మిడి వెంకట్రావులు కోరారు. ఈ సందర్భంగా వారు మంగళవారం మర్యాదపూర్వకంగా ఎస్టీ సెల్ చైర్మన్‌ను కలిశారు. కాకినాడ జిల్లా బిజెపి మాజీ అధ్యక్షులు చిలుకూరి రామ్ కుమార్, కాకినాడ జిల్లా ఉపాధ్యక్షుడు ఉమ్మిడి వెంకట్రావు, ప్రత్తిపాడు నియోజకవర్గ బీజేపీ ఇంచార్జి మట్టా మంగ రాజు, జిల్లా భారతీయ జనతా పార్టీ వైస్ ప్రెసిడెంట్ కామినేని జయశ్రీ, రంపచోడవరం బీజేపీ కన్వీనర్ ఈకబొల్లి కొండల దొర, గోకవరం రెడ్డి తదితరులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెదమల్లాపురంనీ గిరిజన మండలంగా ప్రకటించడంపై చైర్మన్ సానుకూలంగా స్పందించారన్నారు. ఈ కార్యక్రమంలో కాకినాడ జిల్లా ఎస్టీ సెల్ చైర్మన్ కించి జోగిరాజు, దొంతంసెట్టి చంద్రశేఖర్ తదితర బిజెపి శ్రేణులు ఉన్నారు.

మైదానం ఇలా ఉంటే ఆడేది ఎలా...?

- సవంత్సరాలు గడిచిన క్రీడాకారులకు అందుబాటులోకి రాని క్రీడా వికాస్ కేంద్రం

విశాలాంధ్ర - సీతానగరం: మండలంలోని సీతానగరం గ్రామంలోని పువ్వాడ సత్యమాంబ మెమోరియల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు దశాబ్దాల ఘన చరిత్ర కలిగి ఉంది. ఈ పాఠశాల నుండి ఎందరో విద్యార్థులు దేశ రక్షణతో పాటు ప్రభుత్వ ఉద్యోగాలలో సేవలు అందిస్తున్నారు. 2014-19 ఆనాటి టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉండగా సుమారు రెండు కోట్ల రూపాయలతో క్రీడా వికాస్ కేంద్రంకు శంకుస్థాపన చేశారు. ఆనాటి నుంచి నేటి వరకు ఈ క్రీడా వికాస్ కేంద్రం నిర్మాణం పూర్తి కాక నేటి వరకూ క్రీడాకారులు అందుబాటులోకి రాలేదు. ఇది ఇలాగ ఉండగా మిగిలిన పాఠశాల మైదానం పరిస్థితి మంగళవారం కురిసిన ఒక మోస్తరు వర్షానికే చెరువును తలపిస్తుంది. కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా రాష్ట్రంలో క్రీడలను జాతీయ స్థాయిలో గుర్తింపు తేవాలనే అనేక సంస్కరణలు చేస్తున్నారు. కానీ క్షేత్ర స్థాయిలో క్రీడా కారులకు క్రీడలను ఆడుకోవడానికి కనీసం సరైన మైదానాలు లేకపోవడం సమస్య తీవ్రతను తెలుపుతుంది. దీనిపై అధికారులు, నాయకులు స్పందించి క్రీడా వికాస్ కేంద్రం మిగిలి ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయడంతో పాటు పాఠశాల మైదానంలో వర్షపు నీరు నిలవకుండా తగు చర్యలు చేపట్టి క్రీడా కారులకు ప్రోత్సాహం అందించాలని క్రీడాకారులు, ప్రజలు కోరుతున్నారు.

బంతి ఎవరి కోర్టులోనో..

- ఇరిగేషన్ శాఖ మొద్దు నిద్రపై విశాలాంధ్రలో వరుస కథనాలు..

విశాలాంధ్ర - కొవ్వూరు : అటు విజయశ్వరం నుంచి పోలవరం వరకు ఉన్న అఖండ గోదావరి కుడిగట్టు మీద నిర్మితమైన అక్రమ కట్టడాల కోసం విశాలాంధ్ర వరుస కథనాలను ప్రచురిస్తూ వస్తోంది. దీంతో ఒకవైపు భయపడుతున్న మరోవైపు ఇరిగేషన్ అధికారులు మేక పోతు గాంబీర్యాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఈ నిర్మాణాలు మా హయాంలో కావని ఇంతకుముందు ఉన్న అధికారుల హయాంలోనివని దీంతో మాకు ఏమీ కాదని వారు భావి స్తున్నట్లు తెలుస్తోంది. అధికారులు వస్తారు, బదిలీ అవుతారు రిటైర్ అవుతారు, కానీ ప్రస్తుతం ఆ సీట్లో ఉన్న అధికారులు స్పందించాల్సిన అవసరం ఉంది. అయితే ఇక్కడ ముఖ్యంగా కొవ్వూరు గోదావరి బండ్ రిటైనింగ్ వాల్ స్థలం ఇరిగేషన్ది అయినా దానిని అభివృద్ధి చేసింది మాత్రం కొవ్వూరు మున్సిపాలిటీ. హుండీలో ఆదాయం ఈ నేపథ్యంలో మున్సి పాలిటీ ఇరిగేషన్ శాఖల మధ్య రెవెన్యూ అధికారులు రంగంలోకి దిగి తమ వద్ద ఉన్న భూమి రికార్డులను తీసుకుని స్వయంగా క్షేత్రస్థాయికి వస్తే పరిశీలిస్తే గాని వాస్తవాలు బయట పడే అవకాశాలు లేవని నిపుణులు చెబుతున్నారు. వచ్చే సంవత్సరం ఆగస్టులో పుష్కరాలు వస్తున్నందున ఈ రికార్డులను పరిశీలించి పుష్కరాలు ఏర్పాటును పర్యవేక్షం చాల్సిన అవసరం ఆయా శాఖలకు ఉందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

ఆదాయం దేవాదాయశాఖది..
సేవలు మున్సిపాలిటీవి.

కొవ్వూరు గోదావరి ఒడ్డున ఉన్న గోష్పాద క్షేత్రంలో పలు దేవాలయాలు ఉన్నాయి. వీటన్నింటిలో శివాలయం తప్ప అన్ని ఆలయాలు ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లో ఉన్నాయి ఇక శివాలయమ్ విషయానికి వస్తే శివరాత్రి కార్తీక మాసం వంటి పలు సందర్భాలలో దేవాదాయశాఖ అధికారులు వచ్చి హుండీలో ఉన్న ఆదాయాన్ని లెక్కించి ఆ సొమ్ములను పట్టుకెళ్తుంది. ఆ తర్వాత దేవాలయం వంక గాని, దేవాలయానికి ఎదురుగా ఉన్న స్నాన ఘట్టాన్ని శుభ్రపరచడం మెయింటైన్ చేయటం వంటి అంశాలను గాలికి వదిలేస్తుంది.

ఇక మాకు తప్పదన్నట్లుగా గో ష్పాదయాత్రలోని స్నాన ఘట్టాలను శుభ్రపరచడం, అక్కడ విద్యుత్ లైట్లను వెలిగించటం వంటి ప్రధాన పనులను మున్సిపాలిటీ తన సొంత నిధులను వెచ్చించి తమ వంతు బాధ్యతను నిర్వర్తిస్తోంది. ఈ నేపథ్యంలో సంబంధం లేని క్షేత్రంగా ఏటి గట్టు, గోష్పాద క్షేత్రం తయారయింది. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ చేసుకొని వాస్తవాలను ప్రజలకు తెలిసేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు.